కథానిక

* సావిత్రి *

"శండిల"

"సావిత్రీ! భానుమూర్తి మన్ని వాళ్ళింటికి రమ్మని మరీమరీ చెప్పిపోయాడు. రోగం నయమయ్యేదాకా అక్కడే ఉండమన్నాడు. పోనీ వాడేనా నాకు పైవాడు గాదుగా. మనమూ ఒక విషయం ఆలోచించాలి. ఉన్నది పట్నవాసం. సూర్యంచూస్తే ఇంకా కుర్రతనపు చేష్టలు మానలేదు. ఈరోజుల్లో ఇంటద్దె కలిసొచ్చినా కలిసిరావచ్చేమే. ఏమంటావ్" మేనత్త రత్తమ్మ చెబుతున్న మాటలు శ్రద్ధగా వింటోంది పదిహేడేళ్ల వయస్సు గల పడుచుపిల్ల సావిత్రి. అయిదారు నిమిషాలు ఆలోచించి "ఎందుకత్తయ్యా! పట్టుమని పదిరోజులు గడిపేస్తే తెల్లారిపోతుంది. దగ్గు బాగా తగ్గిపోయాక మనవూరే వెళ్ళిపోవచ్చు. మళ్ళీ ఇంతలో ఈమార్పెందుకూ" అన్నది సావిత్రి. భానుమూర్తికి సాధారణంగా పొరుగువాసన కిట్టదే. ఏదో ప్రతిఫలం లేనిదే పల్లెత్తు సాయం పరాయివాడికి చెయ్యడు. అట్లాంటివాడు ఉన్నట్టుండి అత్తయ్యనూ తననూ కామాటంతో వాళ్ళింటికి వచ్చెయ్యమన్నాడంటే?—ఈ రోజుల్లో ఎవడిమటుక్కి వాడికే సంసారం సరిపెట్టుకోవడం కష్టంగా వుంది; మరి ఈ ఆహ్వానం ఎందుకొచ్చినట్టు? "డాక్టరుకూడా కొంచెం స్థలం మార్పిడి అవసరమన్నాడు. భానుమూర్తికి మాత్రం ఏ పదిమందున్నారు. ఒక్కడే హోటలు మెతుకులు కతుకుతూ బతుకుతున్నాడు. పెళ్ళాంపోయి ఇంకా ఏడాది దాటలేదు. అది బ్రతికుంటే అక్కడే ఉండిపొమ్మనేది. కాబట్టి రాత్రికి అబ్బాయొచ్చాక ఆలోచించుకుందాం. జావ తెచ్చిపెట్టు" అంది రత్తమ్మ. సావిత్రి అత్తగారికి జావగాచి పెట్టడానికి లోపలికెళ్లింది. రత్తమ్మ దగ్గుతూ, "పిచ్చిపిల్ల ఇంకా సంసారం బరువు తెలుసుకోలేనిది" అనుకుంది.

సావిత్రి తండ్రి జగ్గరాజూ, రత్తమ్మ పెత్తండ్రి పినతండ్రి బిడ్డలు. పాపం! ఆ పిల్లకు చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోతే నలుగురూ రత్తమ్మనే పెంచమని ఆమె పాలబడేశారు. అప్పటికే తన పెనిమిటిపోయి ఆరేళ్లయింది. ఒక్కగా నొక్క కొడుకు సూర్యాన్ని పెట్టుకుని స్వంతవూళ్ళో అయిదెకరాల మాగాణీ సేద్యం చేయించుకుంటూ ఉంది రత్తమ్మ. బంధువులంతా చెప్పినమాట తీసెయ్యలేక సరే అంది. సావిత్రి పెద్దదిగినకొద్దీ ఒద్దికా, పొందికా నేర్చుకుని నలుగురిలోనూ తల్లో నాలుకైపోయింది. ఇంట్లో పనంతా ఏడోఏటనే చక్కబెట్టడం నేర్చుకుంది. అప్పుడే అనేవాళ్లు ఇరుగూ పొరుగూ "రత్తమ్మా—ఇంకెక్కడ పై సంబంధాలు చూస్తావు సూర్యానికీ, సావిత్రికీ ముడెట్టి వాళ్ళింత కాచిపోస్తూంటే కృష్ణా, రామా అనుకుంటూ కూర్చుందూ" అని. వాళ్లమాటలకు నవ్వుకొని "బి. ఏ. ప్యాసైతేనేగాని మా బంగారు తండ్రి సూర్యానికి పెళ్ళి చెయ్యను" అనేది. సూర్యం రెండెకరాలు ఖర్చుచేసి బి. ఏ. నాలుగుమార్లు తప్పి ఇంటిదగ్గర కూర్చున్నాడు. స్నేహితులు మప్పిన సిగరెట్లు త్రాగడమూ, పేకాడడమూ మిగిలాయి చివరకు. ఈ మధ్య జోరుగా డబ్బు తగలెయ్యడం మొదలెట్టాడు.

చూసి చూసి రత్తమ్మ సూర్యానికి పెళ్లి చెయ్యలేకనే పోయింది. అంతా సుస్తీఘటం తాను. సావిత్రి కావాలనీ ఉంది; కట్నంకానుకలూ, ముద్దు ముచ్చటలూ రావనే దిగులూ ఉంది. "కానీ చూద్దాం" అనుకొంటూండగానే ఈ మాయదారి క్షయదగ్గు వొచ్చిపడింది. అందరూ పట్నంలో మకాం పెట్టమంటే పొలంమీద అయిదువందలు అప్పుతెచ్చి నగరంలో ఇల్లొకటి అద్దెకు తీసుకొని మందు పుచ్చుకొంటోంది. ఎదిగిన పిల్ల సావిత్రే ఆమెకు అహర్నిశాలూ శుశ్రూష చేస్తోంది. రోజులు గడచినకొద్దీ సావిత్రి మీద వాత్సల్యం దానంతటదే బలంగా అలుముకుంటూంది రత్తమ్మలో. "ఈపాటికే చేసెయ్యవలసింది—ఏమిటో ఏకసుస్తీ అయిపోయింది. సూర్యం చూస్తే

దురలవాట్లు మఱిగి పాడైపోతున్నాడు—పెళ్ళైతే కొంచెం బరువుమోస్తాను" అంటూ ఎన్నోసార్లు సతమతమైంది. ఈ మాటలు వింటూంటే సావిత్రికి రత్తమ్మ జబ్బుగూడా తన మేలుకొఱకే వచ్చినట్లనిపించి లోలోపల తీయనికలలు కంటోంది. అయితే ఆమె జబ్బు త్వరలో నయమయ్యేటట్లు కనిపించడం లేదు

పట్నంలో తమకు పరిచయమైన బంధువు భానుమూర్తి ఒక్కడే. ఎప్పుడూ తియ్యగా మాట్లాడుతుంటాడు. రెండురోజుల కొకసారైనా రత్తమ్మను చూసిపోతుంటాడు. వద్దంటున్నా వినక బత్తాయిలూ, దానిమ్మపళ్లూ, ద్రాక్షా తెచ్చి పడేసిపోతూంటాడు. ఒకటి రెండుసార్లు తనకు మల్లెపూలు గూడా తెచ్చి వుంచాడు. అతనిది పెద్దాస్తి. పట్నంలో నాలుగు మేడలు అద్దెకు త్రిప్పుతున్నాడు. నెలకు ఎంత లేదన్నా మూడువందలు పైచిలుకు వస్తుంది. అతను మరీమరీ పట్టుబడుతున్నాడు రత్తమ్మని రమ్మని. డాక్టరుగూడా మకాం మార్పు చేయమన్నాడు.

జావగాచుతున్న సావిత్రికి గతమంతా తలుచుకొంటూంటే భావి అగమ్యగోచరంగావుంది. "వెళ్లడమా - మానడమా"—తానైతే పెండ్లికాని పిల్ల. సూర్యం చూస్తే ఎప్పుడూ క్లబ్బులో నే ఉంటూ డబ్బు చీట్లాటకు తగలేస్తున్నాడు. తాను అతని ఉప్పుతిని పెరిగి, చెప్పుచేతల్లో మెసిలి తెగించి ఎలాగ మందలిస్తుంది. రత్తమ్మ అన్నా అతడు పట్టించుకోడు. గారాబుకొడుకు. రోజురోజుకీ రత్తమ్మ పరిస్థితి విషమిస్తోంది. డబ్బు మంచినీళ్లలా ఖర్చయిపోతోంది.

జావ త్రాగినతర్వాత రత్తమ్మకు నిద్ర పట్టింది. సావిత్రి సూర్యంకై ఎదురుచూస్తూ ఏదో కథల పుస్తకం తిరగేస్తూంది. చదువుతోందన్నమాటే గాని, ఆమె మనసు మనసులో లేదు. గడియారం పన్నెండు కొట్టింది. సాయంత్రమనగా — భానుమూర్తి రావడానికి గంటముందు — నాలుగున్నరౌతుందేమో— వెళ్ళిన సూర్యం ఇంకా మెతుకులకు రాలేదు. పేకాటలో మునిగి ఊళ్ళకుఊళ్లు తగలేసుకున్న జమీందార్ల కథలు తాను చదివింది. "సూర్యం అంతవాడు గాకపోయినా—ఏముందీ ఎంతచెట్టు కంత గాలి" అనుకుంటోంది. సాయంత్రం భానుమూర్తి పారేసిపోయిన సమస్య ఆమె మెదడులో అలా ఇరుక్కుని తెక్కొండా ఉండిపోయింది.

ఇంతలో సూర్యం వచ్చాడు. "అమ్మ పడుకుందా—నీవు భోంచేసేవా"? అన్నాడు లోపలికి అడుగుపెడుతూనే. "ఆ! జావదాగి పడుకుందత్తయ్య. మీరు చెయ్యనిదే నే నెలాతిన్నా" అంది సావిత్రి. "ఎన్నిసార్లు చెప్పలేదు నాకోసం కూర్చోవద్దని నే భోంచెయ్యను—గ్లాసెడు మజ్జిగియ్యి" అన్నాడు. సావిత్రి లోపలికివెళ్ళి మజ్జిగ గ్లాసులోపోసి ఉప్పు రంగరించి తెచ్చింది. సూర్యం త్రాగుతూంటే ప్రస్తావన ప్రారంభించింది. "భానుమూర్తి సాయంత్రం మీరు వెళ్ళాక వచ్చాడు. అత్తయ్యను మరీమరీ తమ యింటిదగ్గరుండమని బ్రతిమాలాడు. మీ రేమంటారోనని మాటివ్వలేదు" అంటూన్న సావిత్రితో "అక్కర్లేదు—పదిరోజు లిక్కడేఉంటే సరి—రోగం నయమవగానే మనింటికే పోవచ్చు" అన్నాడు సూర్యం ముడిగా. "డాక్టరుగారు ఇంకా నెలా పదిహేను రోజులైనా ఉండాలన్నారు. పైగా ఏవో క్రొత్త ఇంజక్షన్లు కొనాలన్నారుగా" అని ప్రొద్దుటిసంగతి మరచిపోయిన సూర్యానికి జ్ఞప్తిచేసింది సావిత్రి.

వీధి వసారాలో అమర్చిపెట్టిన మడత మంచంమీద మేనువాల్చి ఆలోచించాడు సూర్యం—ఆవాళ అనుకోకుండా అరడజను కుడేళ్లు పంచిపెట్టాడు. ఎదురు మంచిగాకనో ఇంట్లో పోరువల్లనో ఎత్తుకున్న ముక్కల్లా ముక్కలు చేసేసేది ఆటను. డబ్బు సీదాగా ఖాళీ అయిపోయింది. అమ్మకూ సావిత్రికీ తెలిస్తే ఏమనుకుంటారో. ఇంక తనవద్ద మిగిలింది రేపు సాయంత్రమే వచ్చే నెలకు ఇంటి కివ్వవలసిన అద్దె ఇరవైరూపాయలూను. తన ఊరికి సొమ్ము పంపమని రైతుకు వ్రాస్తే ఇంకా మనిఆర్డరు రానే లేదు. రేపు క్లబ్బుకు వొట్టిచేతులతో వెళ్ళడమా—మానడమా—చూడగా చూడగా తప్పక ఆటకు వెళ్ళి తీరాలన్న నిశ్చయానికి ఒకే ఒక ఊహ తట్టింది అతనికి.

చటుక్కున లేచాడు. లోపల అమ్మ మంచం ప్రక్కన తుంగచాపమీద బొంతపరచుకుని పగలల్లా ఇంటిచాకిరీచేసి వొళ్లుమరచి నిద్రపోతున్న సావిత్రిని సమీపించాడు. తన ఊహ ఆమెతో ఎలా చెప్పాలి? గదంతా చీకటిగా ఉంది. దీపం ఆరిపోయిందో ఏమో! "సావిత్రీ!" ఒకసారిపిలిచాడు. పాపం! అలసిసొలసిన ఆ పిల్లకు మెళుకువరానిదే. ఆమె దగ్గరగా వెళ్ళి తట్టిలేపాడు. ఆమె కళ్లు నులుముకుంటూ లేచింది. "ఇంత రాత్రివేళ లేపారెందుకూ" అంది. "రేపు ప్రొద్దున్నే మనం మకాం మార్చేద్దాం. అమ్మ

జబ్బు నయమవాలంటే మార్పు అవసరం. రోగం ప్రశమించుతూనే ఉందిగాని తిగ్గుముఖం పట్టడం లేదు. భానుమూర్తి ఇంటికి వెళదాం." అంటున్న సూర్యం ఆలోచనలో జరిగిన మార్పుకు ఆశ్చర్యపడి "అతడు రమ్మన్నాడు గదా అని వెడితే బాగుంటుందా" అంతకన్న తన అనంగీకారం సూర్యంముందు సావిత్రి బలంగా వ్యక్తం చెయ్యలేకపోయింది. "అబ్బే—రేపు ఈ ఇల్లు ఖాళీ చేసెయ్యాల్సిందే—తప్పదు. ప్రొద్దున్నే అమ్మతో చెబుతా" అంటూ వీధి వసారాలోకి వెళ్ళిపోయాడు సూర్యం. ఇంత రాత్రివేళ తన్ను ఎన్నడూ లేనిది సూర్యం చీకటిలో తట్టి లేపడం అందునా ఏకాంతంలో ప్రశాంతంగా ఉన్న చీకటిలో ఇలా క్రొత్త గొంతుతో మాట్లాడ్డం సావిత్రికి విడ్డూరంగానేఉంది. రత్తమ్మలోవలె ఇటీవల సూర్యంలో గూడా తనంటే ఆప్యాయతా, ప్రేమా పొడుకొంటున్నాయని ఆమెకు ఈ సంఘటన ఋజువుచేసింది. లేకుంటే లోగడ ప్రతి చిన్నవిషయమూ తల్లీ కొడుకులు నిర్ణయించడమూ, తాను నోరెత్తకుండా ఆచరించడమూ పరిపాటి. ఈనాటినుండి ఆమె జీవితంలో ఒక మార్పు మొదలుపెట్టింది. తాను ఒక ఆరిందాగా, పెద్దదిగా, ఓరిమిపరురాలుగా వారిద్దరి దృష్టిలోనూ పెరిగి వారికి మరింత దగ్గరయింది. ఇది ఆమెలో ఎనలేని ఆనందం కలిగించింది. అయితే మకాం మార్పిడి విషయమే ఆమె తనలో సంబాళించుకోనలేక పోతోంది. ఎంత ఆప్యాయతగా వస్తున్నా భానుమూర్తి అంటే తనకు క్రొత్తే. కాకున్నా ఇంటిలో అత్తయ్యతో ఎప్పుడూ పడిఉండేది తను. సూర్యం చూస్తే తిండేనా తినకుండా తిరుగుతూండే మనిషి. ఏమో! భానుమూర్తి ఎటువంటివాడో—కాకపోయినా నిజంగా రత్తమ్మమీద అభిమానమేనా అతన్ని పిలిచేటట్లు పురికొల్పుతా—ఇంతలో చటుక్కున ఒక క్రొత్త ఊహ తొలకరి మెఱుపులా ఆమె మనోవీధిలో దూసుకుపోయింది. తనకు సూర్యంతో పెళ్లయిపోయివుంటే ఎంతబావుండేది. దాని వెనకనే ఒక చిన్న సమస్య—సూర్యం ఇంతలో ఇంతకే తన ఊహ ఎందుకు మార్చేసుకున్నాడు. ఆమె చిన్ని మెదడులో ఈ సమస్యలు తేలిగ్గా పరిష్కరింపబడలేక పోతున్నాయి.

2

మరునాడు ప్రొద్దున్నే బండి అద్దెకు కట్టించి సూర్యం భానుమూర్తియింటికి మకాం మార్చేశాడు. సావిత్రికి ఇది ఇష్టంలేకపోయినా చేయక తప్పింది గాదు. భానుమూర్తి కిది అనుకోకుండా జరిగింది; కాబట్టి అతడు ఎంతో ఆనందం అనుభవించాడు. అతని సంతోషాన్ని రత్తమ్మ ఒకలాగా, సూర్యం ఇంకొకరీతిగా — అందరికంటె సావిత్రి ఇంకొక మాదిరిగా అర్థం చేసుకున్నారు. మన మనస్సులో తిష్ఠ వేసుకున్న అనుమానం కారణంగా జరిగే ప్రతి దాన్నీ మన గీటురాయిమీద గీచి చూసుకుంటాం. ప్రతిసన్నివేశమూ, పరిస్థితుల్లోవచ్చే ప్రతిమార్పూ దాన్ని బలీయం చేస్తున్నట్లు భావిస్తాం. అది మంచైతే ఆనందమూ చెడుగైతే బాధా మనకుగా మనం నెత్తిన రుద్దుకుంటాం. మానవసహజమైన ప్రవృత్తుల్లో ఇదొకటి. ఇంతకీ చెప్పవలసిన విషయం సావిత్రి కిది చేదుగానే రుచించింది. సామానులింట్లో సద్దకుండానే సూర్యం క్లబ్బుకు వెళ్ళిపోయాడు. అనుకోకుండా పదిహేనురూపాయలు కలసి వచ్చాయి అతనికి.

భానుమూర్తి బజారుకువెళ్లి ఇంట్లోకి కావలసిన సరుకులూ, రత్తమ్మకి పళ్ళూ, కూరలూ తెచ్చాడు. ఆవాళటికి అతడు ఎప్పటిలాగా హోటల్లోనే తిన్నాడు. డాక్టరువచ్చి రత్తమ్మను పరీక్ష చేసి సుమారు నెలా పదిహేనురోజులైనా ఉండాలని చెప్పి పోయాడు. అతనికి కొంత డబ్బు భానుమూర్తే చెల్లించడం సావిత్రి స్వయంగా చూచింది. తాను ఎవ్వరినీ ఏమీ అనడానికి వీల్లేకుండా ఉంది. భానుమూర్తితో ఎదటబడి మాట్లాడ్డానికి ఎంతో భయంగా ఉంది. ఇలాగే రెండుమూడురోజులు గడిచాక ఒకనాడు రత్తమ్మ సావిత్రిని పిలిచి "ఏమే — వాడికి లేకపోతే ఆడదానివి నీకేనా మర్యాదా, మంచీ ఉండఖ్ఖర్లేదుటే! ఇంతగా మన్ని ఆదుకొంటూన్న మా నాయన భానుకి రెండు మెతుకులే వండి పెట్టలేవూ. నేను మంచమెక్కడం ఎంత ప్రారబ్ధ మొచ్చిపడిందే—ఇంతకీ నా కర్మ" సావిత్రి కేం సమాధానం చెప్పాలో పాలుపోవడం లేదు. క్రమంగా ఎవరో పెద్దబరువును తనమీద మోపుతున్నట్లు క్రుంగిపోయింది. "తెలిసిందిగాదు అత్తా. మీరు ఆనక చెప్పండి రేపటినుంచీ ఇక్కడే తినమని. పెళ్ళికాని పిల్లను నేనెలా నోరు మెదపను ఆయనముందు. మీరే చెప్పండి!" అంది రుద్ధకంఠంతో. "పిచ్చిపిల్లా వాడుమాత్రం పైవాడామ్మా! మా అక్కయ్యే వుంటే ఎంత ఎరమరిక లేకుండా ఉండేది? సరే—నేనైనా చెబుతాలే" అంటున్న రత్తమ్మ మాటలు విని సావిత్రి లోపలికెళ్ళిపోయింది. రాత్రి పన్నెండు గంటలకు ఇంటికొచ్చిన కొడు

కుతో గూడా అదే సణిగింది రత్తమ్మ. ఇదంతా విని ఈవేళగూడా సీదాగా జేబు ఖాళీచేసి వచ్చిన సూర్యం పోకడ కనిపెట్టి దుఃఖంతో కళ్లు మూసుకుంది సావిత్రి. మరునాడు ప్రొద్దున్న సూర్యం కటువుగా మాట్లాడాడు. "ఇంకా తనకు ప్రపంచ జ్ఞానం తెలీదుట; పెద్దాళ్లను చూసైనా నేర్చుకోవడం లేదుట; ఇప్పటినుంచైనా మంచి అలవాట్లు చేసుకోవాలట; తాము ఆయన ఇంట్లోపడి తింటూ ఆయనకు తిండి పెట్టకపోవడానికి ఎంతో భానుమూర్తి కుములుతూన్నాట్ట" ఈ చివరి చురుకు ఆమెలో పౌరుషం రేకెత్తించింది. నిజంగా భానుమూర్తి అలా మథనపడుతున్నాడా—ఆమెకు వాస్తవంగా ప్రత్యుత్తరం రాలేదు. కాగా భానుమూర్తి లోలోన ఎంతో ఖులాసాగా ఉన్నట్లు గుర్తించింది ఆమె అనేకసార్లు. తాను పన్నిన వ్యూహంలో జయసూచనలు గాంచినప్పటి సేనాధిపతి పొందే ఆనంద రేఖలు అతని కళ్లల్లో కొద్దిగానైనా సావిత్రి చూడలేకపోలేదు. కనుక సూర్యం చేసిన ఈ మందలింపు ఆమెకు అన్యంగా తోచింది.

మరునాటినుంచి సావిత్రికి మరీ క్లిష్టపరిస్థితి వచ్చిపడింది. భానుమూర్తి ఊళ్లోపనులు చూసుకుని వేళగాని వేళ భోజనానికి వచ్చేవాడు. రత్తమ్మ మంచంపైనే ఉందిగదా. సూర్యం ఎప్పుడూ ఊరు పట్టుకునే తిరిగేవాడు. రోజూ ఇంటికి ఉత్తరాలు వ్రాయడం, రైతులు డబ్బు పంపారో లేదో అని సణుక్కుంటూ పదేపదే పోస్టాఫీసు కెళ్ళివస్తూ, వాళ్ళేమీ పంపకపోతే తిట్టుకోవడం, మధ్య మధ్య తన మీద గూడా చీకాకుపడడం అలవాటు చేసుకుంటున్నాడు. తానొక్కర్తే ఏకాంతంగా భానుమూర్తికి భోజనం పెట్టవలసివచ్చేది. అయితే అతడుమాత్రం ఎప్పుడోగాని ఆమెతో మాట్లాడేవాడు గాదు. ఏదేనా నూటికీ కోటికీ మాట్లాడినా ఆమె వంటకాలను ప్రశంశించడం, రత్తమ్మ యోగక్షేమాలు తెలుసుకోవడం, సూర్యాన్ని దుయ్యబట్టడం ఇట్లాంటివే జరుగుతూండేవి. సావిత్రి మాత్రం చాలాసార్లు 'మౌనంగా ఉంటూనే భాను తన నేత్రాలతో ఆమెను నఖశిఖ పర్యంతం త్రాగేద్దామా' అని మిఱ్ఱుచూపులు ప్రసరిస్తున్నాడా అని అతని నైఖరినిబట్టి అనుమానం పడుతూండేది. ఇంటి ఖర్చులతోబాటు భానుమూర్తి అప్పుడప్పుడు సూర్యానికి పెట్టుబడి పెడుతూండేవాడు గూడా పేకాటకు—ఈ ఆదరణలు, అనుకోని ప్రేమలు కేవలం ఆయన ఊరికేనే చూపుతున్నాడా అని ఆమె రంధి. దీనివల్ల ఒకటిమాత్రం పరిణమించింది. రత్తమ్మకూ, సూర్యానికీ భానుమూర్తిపై మమకారం ఎక్కువైంది. ఏవో పొలంమీదవచ్చే శిస్తులు తెచ్చుకుంటూ ఇక్కడే ఉండిపోతే ఎంత బావుంటుందీ? అనుకొనేదాకా వారి మనస్తత్వాలు మారిపోయాయి.

ఒకనాడు సావిత్రి వంట చేస్తూంటే చిన్న తమాషా జరిగింది. పోపుల పెట్టెకోసం అలమారు తెరచిన ఆ పదుముకంటికి అవుపించిన రెండు వస్తువులు ఆమెను పులకితాంగిని చేశాయి. ముప్పేట గొలుసు ఒకటి—రెండోది ఒక గాజులజత. అట్లాంటి నగలు సావిత్రి అనేకసార్లు ఇతరులవద్ద చూచింది. అప్పుడు వాటిని చూచిన దృష్టే వేరు. కన్నెప్రాయపు ఆకర్షణకు లొంగి ఇప్పుడామె కేవలం ఇంకొకదృష్టితో చూడసాగింది. అబలత్వం ఆమెను ఆవహించింది. లాలస లలనకో బలహీనత. సహజ దౌర్బల్యాన్ని ఆమె ప్రతిఘటించలేకపోయింది. ఔను! ఆ లేబ్రాయపు కన్నె హృదయం బరువైన జీవితంలోని అనుభవాలెన్ని చూసిందీ? చటుక్కున ఆ గొలుసు మెడలో వేసుకుంది. గాజులు సరిగా చేతులకు సరిపోయాయి. ఎవరో తనకోసమే చేయించి పెట్టినట్లుంది. ఒక్క అంగలో నడవలోనికి దూకి నిలువుటద్దంముందు నిలచింది. నిజంగా తనలో ఇంత అందం ఇమిడివుందా. నివురుగప్పిన నిప్పులా సొగసుదనం తనలో పొదుక్కొని వుంది. భానుగాని సూర్యంగాని అప్పుడప్పుడు దప్పిగొన్న అడవి మృగాలవలె తనను శరీరంలో కణకణమూ మ్రింగివేయాలని ఎందుకు చూస్తున్నారో తనకు తాను తెలుసుకోగలిగింది. మళ్ళీ అద్దంలో తన ప్రతిబింబం చూసుకుంది. చిరునవ్వుతో మురిసిపోయింది. గిరుక్కున మెడ వెనక్కు త్రిప్పి ఆ సోయగంగూడా చూడదలచింది. గొలుసు ఆ తిరుగుడులో పేటలుగా చీలి ఆమె గుండెలను బలంగా ఆవరించింది. ముప్పేట గొలుసు ఆమె గుండెను గట్టిగా అదిమిపట్టి గుండెలో నుండి పైకుబికే హృదయంలోని పొంగును దేనోన్న అణచివేస్తున్నట్లు ఆమెకుతోచింది ఆ ఉవ్వెత్తుగాలేచే శక్తి యౌవ్వనపుపొంగు గాదు; శారీరకప్రకోపం అంతకన్నా కాదు. ఆమె ఎన్నడూ ఊహించలేని ఆమెలో నిబిడీకృతమైఉన్న ఒక దివ్యశక్తి, అంతర్వాణి నేడు ఆమెకేదో చెప్పడానికి ఉద్వేగంతో ఆమె ఎద తలుపుల్ని తెరచుకొని వెలికి వస్తూంది. సావిత్రి నిశ్చేష్టురాలైంది.

"సావిత్రీ! ఈ నగలెవరివే వెర్రిదానా! ఇవి భానుమూర్తి ప్రథమకళత్రం జానకివే—నీవు వాటిని

ధరించావు. వీటిని ధరించే త్రాణకోసం ఉబలాట పడేముందు ఆతన్ని గూడా ధరించగలనో లేనో అని ఆలోచించుకో—కేవలం నగలూ, నాణేలూ గాదు ప్రపంచంలో ప్రధానం! నీతీ, నియమమూ, సౌశీల్యమూ స్త్రీకి పుట్టుకతోవచ్చిన పెట్టని భూషణాలు. వాటి నెవ్వరూ దొంగిలించలేరు—

కాగా ఈ వస్తువులు—కన్నెపడుచా—పిచ్చి రామచిలుకా! నిన్ను పట్టుకోవడానికై వేటకాడు పన్నిన ఉచ్చులలోని జీడిపలుకులు ఇవి. జాగ్రత్త ఇప్పుడైనా శ్రుతిమించలేదు—వీటిని తప్పించుకొని ఎక్కడికైనా ఎగిరిపో"—సావిత్రికి ఒడలంతా గగుర్పొడిచి ముచ్చెమటలు పోసింది ఈ అంతర్వాహినీ తరంగాలు పెల్లుబకడంతో. ఆమె కళ్లు చెమ్మగిల్లాయి. ఇంతటి బరువైన, బలమైన సందేశం ఇవ్వడానికి ఆ కన్య లేతహృదయం ఎంత సతమతమైపోయిందో—అప్రయత్నంగా ఆమె నోట పిచ్చిగా రెండుముక్కలు భయంతో వెలువడ్డాయి. —ఎక్కడికి ఎలా ఎగిరిపోనూ"ఎదురుగాగోడకు తగిలింపబడ్డ రవివర్మ చిత్రం చూచింది. యమధర్మరాజు క్రూరంగా సత్యవంతుని ప్రాణాలులాక్కుపోతూంటే వెర్రిగా సావిత్రి వెంబడిస్తోంది పతికై. "ఔను! ఆమె జయించింది నే నెందుకు నిలవరించలేను" అనుకొని ఆత్మవిశ్వాసం నింపుకొని త్రుటిలో ఆ నగలు తీసేసి యథాస్థానంలో వుంచి మళ్లీతన నిత్యకృత్యంలో లీనమైంది. ఛా—ఇదేవిఁటి ఇంత 'బేలనయ్యాను' అనుకొంది.

మధ్యాహ్నం రెండింటికి భానుమూర్తి భోజనానికి వచ్చాడు. మాట్లాడకుండా మజ్జిగ పోసుకోవడందాకా వచ్చింది వాయి. ఇంక ఉండబట్టలేక సావిత్రే ప్రారంభించి "మఱచిపోయి అలమారులో వుంచేసినట్లున్నారు కాసులు పేరూ, గాజుల జతాను. తీసి జాగ్రత్తపెట్టండి" అంది. "ఆఁ—ఇక్కడ మాత్రం పైవాళ్లెవరున్నారూ! కాకపోయినా అది బ్రతికున్నపుడు అన్నీ తానే చక్కబెట్టుకునేది. తర్వాత క్రమేపీ నాబుద్ధి మందగిస్తోంది. ఏం బ్రతుకో—వెధవజన్మ" భానుమూర్తి కంఠం రుద్ధమైంది. "ఇదిగో—అలా ఇదవకండి. మనం మాత్రం కలకాలం ఉట్టిగట్టుకు ఊరేగుతామా. విచారించి ప్రయోజనం?—ఊరుకోండి" ఇది మానవ సహజమైన సంతాపం, సావిత్రిసానుభూతి వెల్లడిచేసింది. పీట మీదనుంచి లేస్తూ దుఃఖం నిండుకున్న కళ్లతోనే సావిత్రివైపు ఒకసారి చూశాడు—ఆ కన్నీళ్ల వెనుక దాగివుండే ఆ ప్రాణి ఎందుకో తన సానుభూతిని మరీ మరీ లాక్కోన తాపత్రయ పడుతున్నాడని గ్రహించిన సావిత్రి గుండె గతుక్కుమంది. చేతులు కడుక్కుని తుండున తుడుచుకొంటూ "పోనీ సావిత్రీ—అవి అలాగ బందిఖానాలో పడిఉన్నట్లు ఇనప్పెట్టెలో ఎన్నాళ్లు మూలుగుతాయి. నీవు వేసుకో ఏమీ అరిగిపోయేవీ విరిగిపోయేవీ గావుగా" అంటూ ఆమె సమాధానానికైనా వేచియుండక నడవలోకి నడచాడు. సావిత్రి చెప్పుతూనే ఉంది. "వద్దు అవి నాకెందుకూ—జాగ్రత్తపెట్టండి." భానుమూర్తి నగలను, జహ్వారీని ఖాళీచేసిన ఇనప్పెట్టెలో తన హృదయాన్నుంచి శాశ్వతంగా బందీ చేయబోతున్నాడేమో అని హడలిపోయింది. ప్రాణంలేని వస్తువుల స్థానే తన పవిత్రమైన, ప్రాణంకంటె మిన్నయైనదాన్ని దేన్నో ఆతడు లాగివెయ్యడానికి గేలం వేస్తున్నట్లు పసికట్టింది ఆ పడుచు.

3

రత్తమ్మ మకాంమార్చి ఇరవైరోజులయ్యింది. అయినా గుణమేమీ కానరావడంలేదు. డాక్టరు రోజూ పరీక్షచేసి సూదిపోట్లు పొడిచి వెడుతూనే ఉన్నాడు. క్రమేపీ ఆమె స్థితి క్షీణిస్తోంది. రెండు నాళ్ళ నుంచీ మరీని. కళ్లెలో నెత్తురుజీర పడుతోంది. రోజులెంతో బరువుగా దొర్లుతున్నట్లనిపించింది సావిత్రికి. సూర్యం బొత్తుగా ఇల్లుమొహం మఱచిపోతున్నాడు. తల్లిజబ్బు అలాగుండేదే అనేధీమా నెలకొన్నది ఆతనిలో. పేకాటకు ఇంటిదగ్గరనుంచి వొచ్చిన డబ్బూ చాలడంలేదు; భానుమూర్తి ఇచ్చే అప్పూ చాలడంలేదు.

ఆవాళ శనివారం. ప్రొద్దుటనే స్నానం చేసి పూజాదికాలు ముగించుకొని సావిత్రి వంట పనిలో లీలమైంది. వసారాలో మంచంమీద రత్తమ్మ నిద్రపోతోంది. ఏడున్నర గంటలకే ఊళ్లో తనకు రావలసిన ఇళ్లద్దె బకాయిలు వసూలు చేసుకోవడానికి వెళ్లాడు భానుమూర్తి. సూర్యం రైతుతో మాట్లాడ్డానికి స్వగ్రామం వెళ్లాడు. మనసు పరిపరి విధాలపోయి యేమీ తోచక దిగులుపడి అలాగే రెండుగంటలసేపు కూర్చుండి పోయింది. ఇంతలో నడవలో గడియారం తొమ్మిదిన్నర కొట్టింది. అత్తయ్యకు జావ కాచడానికి పొయ్యిమీద నీళ్ళు పెట్టింది.

నీళ్లు సలసల మఱుగుతున్నాయి. వాటిలో రవ్వ వేసింది. రవ్వతో కలసి ఉడికే జావ కెరటాలు లేస్తోంది. కళపెళ ఉడుకుతోంది. ఆమె తరుణ హృదయంలో ఒక్కసారి ఎన్నో తీయని కోర్కెలు కెళ్లు

తున్నట్లూ వాటికి జావలో పొంగులు తాళం వేస్తున్నట్లూ అనిపించింది. జీవితంలో సుఖం అన్నది తీయగా ఉంటుం దనుకోవడమే గాని ఎన్నడూ చవి చూడని పడుచు. ఆద్వారం తెరచుకుని పట్టుపాన్పుల పై పరచబడ్డ ఆ అందాల దొంతరలను అమాంతంగా కౌగలించుకునే పుణ్యక్షణం ఎప్పుడొస్తుందో గదా! ఆహా! జీవితంలో యౌవ్వన ప్రభావం వర్ణనాతీతం. ఊహించిన కొద్దీ ఆమెలో భావాలు సముద్ర కెరటాలవలె ఉరకలెడుతూ ఉవ్వెత్తుగా లేచి ఎదురు తాకే ఆస్కారంలేక తమకుతామే ఢీకొని ప్రిదిలిపోయి నురుగులు గక్కి ఉక్రోషంతో వెనక్కు పోతున్నాయి. ఈ వీచులతో సావిత్రి మేనుస్నానం చేసి, పరిశుభ్రతను కూర్చుకొన్న ఆమె శరీరంలో అవయవాలన్నీ గగుర్పాటుతో కీలక స్థానంలో నిలుచున్న బాటసారుల్లా నిటారుగా నిలుచున్నాయి. ఆమె అంద చందాలు ఆక్షణంలో అక్కడున్న ప్రాణవిహీనములైన పాత్రలకు తెలుసు; అక్కడ పరివ్యాప్తమైఉన్న పంచభూతాల కెరుక — ఇట్టి సంఘర్షణ ఆమె ఏకాంతంగా ఉండగా జీవితంలో పొందడం, ఇదే ప్రప్రథమం.

భావజలధిలో మునిగి జావ పొంగి పోవడం చూడడం అశ్రద్ధ చేసింది. పాత్ర అంచుల మీదనుంచి పొర్లి పొయ్యిలోపడ్డ తెరకలు ఆమెను ఈప్రపంచంలోకి లాక్కొచ్చాయి. పీటమీదనుండి లేచి పొయ్యి మీదికి వంగి రెండు చేతులనుఎత్తి గిన్నెను తీయడంలో సవరించుకోని ఆమె పమిటకొంగు పొయ్యిలోకి పడిపోతూన్న క్షణంలో — "ఆఁ — ఆఁ — సావిత్రీ అంటూ" ముందుకువచ్చి ఆమె పమిటనుఎత్తి భుజాలమీదకు చేర్చి ఆమెను పొదివి పట్టుకొన ప్రయత్నించాడు భానుమూర్తి. 'ఈయ నెప్పుడొచ్చాడు — భా — ఇదేమిటి' అనుకుని కలద్రొక్కు కోవడంలో కాళ్ళ దగ్గరున్న గరిటె పొయ్యిలోకి దొర్లింది. అగ్ని నాలుకలుచాస్తూ భానుమూర్తి కామంలా ఎగబ్రాకుతూంది సావిత్రిముఖం దెసకు. గుప్పున సెగదగిలి ఆమె కళ్ళు మూసుకుంది. ఇదంతా కొన్ని సెకన్లలో జరిగి పోయింది. సావిత్రికి నిలువునా ప్రాణాలు పైకెగసిపోయాయి "మీరు — వదలండి — ఇదేంన్యాయం —" పెనగులాడుతోంది అతనిచేతులు విడిలించు కోవడానికి. నోటితో కరుద్దామా! గోళ్ళతో రక్కుదామా! ఏంచేయాలీ కబంధహస్తాల్ని ఛేదించడానికి — ఆమెకేమీ తోచడం లేదు. భానుమూర్తి చిత్రప్రతిమయై ఆమెనింకా అలా పట్టుకునే ఉన్నాడు. అతని భావం ఆమెకు అర్థంకాలేదు. అతడు తన్నేంచేద్దామని అలా పట్టు కున్నాడు?

చుట్టూ ఆయుధానికై ప్రాకులాడింది లాభం లేక పోయింది. పాదముల ముందున్న ఇనుపగరిటె సన్ననికొస ఆమె దెసకు కొరకొర చూసింది. వెంటనే చేతిని అటుపోనిచ్చి గరిటె దీసి ఉన్నట్లుండి ఒక్క పెట్టు తన భుజాల్ని అదిమే ప్రేళ్ళమడతపై వుంచింది. పొయ్యిలోఉండి కొద్దిసేపేఅయినా గరిట ఎర్రగా కాలిపోయి ఉంది. 'కెవ్వు'న కేక పెట్టి 'అబ్బా! ఎంతపని చేశావు సావిత్రీ!' అంటూ రెండు గజాల దూరాన కూలబడ్డాడు భానుమూర్తి. మదం వొదిలి మళ్ళీ స్పృహలో కొచ్చాడు. సావిత్రిపై చింత నిప్పులు కురిపిస్తూ "సరే! నీ ఇష్టంవచ్చినట్లు చేద్దామను కుంటున్నావు. పెళ్లి కావలసిన దానివి జాగ్రత్తగా ఆలోచించుకో. నాకా ఇంకా ముప్ఫై దాటలేదు. ఆస్తిపాస్తులు గలవాణ్ణి. నీఉద్దేశం నేను శాన్నాళ్ల క్రితమే తెలుసు కున్నాను. సూర్యం గతి ఏమవుతూందో తెలుసుకో — డాక్టరు మీతో చెప్ప లేదు. నాలుగైదు రోజుల్లో రత్తమ్మ కాలంచేస్తుంది పొలం తనఖా పెట్టి డబ్బుదెచ్చి పేకాడి తగలేస్తున్నాడు. ఈమధ్య త్రాగుడు గూడా అలవాటుచేసుకున్నాడు —" అంటూ బొబ్బలెక్కిన చేతిని చూపుతూ "సరే — నేను దీన్ని ఎన్నడూ మరువలేను — ఇంకా నీవేమో వివేకంగా ప్రవర్తిస్తావను కున్నా — బాగా ఆలోచించుకో సావిత్రీ — నీభవిష్యత్తు నీచేతుల్లో ఉంది. నన్ను పెళ్లిచేసుకు సుఖించినా సరే — లేక కాదని కష్టపడ్డా సరే. నేను నిన్నేమీ చెడిపోమనడంలేదు. సంపన్న గృహిణివై వృద్ధిలోకి రమ్మంటున్నా" అంటూ చరచర బయటకు నడిచాడు. "వీళ్లంతా తనయింట్లో వుంటున్నారు; సూర్యం తనడబ్బు వాడుకుంటున్నాడు; సావిత్రి మాత్రం తాను తెచ్చిన పూలు పెట్టుకొనేది, ముగ్ధగా తనతో మాట్లాడేది; ఇంట్లోకి ఏమికావాలన్నా వినయ విధేయలతో తనతో చెప్పి తెప్పించుకునేది. వచ్చి ఇన్నాళ్ళైనా కనీసం కళ్లెత్తైనా తనపై అయిష్టం ప్రకటించలేదు; ఆమె వొట్టి అమాయకపు పిల్ల; తనవంటి ధనికుణ్ణి, ప్రాయంలో ఉన్నవాణ్ణి కాదంటుందా అని భ్రమపడి ఎంత తొందర పడ్డాను! సరే సిరిరామోకా లొడ్డింది. మీద ఈమె గతి ఏమవుతుందో చూస్తాగా" అనుకొని డాక్టరు దగ్గరకు వెళ్లిపోయాడు.

ఇంక సావిత్రి. తాను మూర్ఛిల్లి పోయినట్లే అయింది. పంచేంద్రియాలు పని చేయలేదు ఆమెకు.

కళ్లు తెరచి తన శరీరాన్ని తానే అసహ్యించుకొంది. ఎంతలో ఎంత మార్పు—క్షణం క్రితం నవనవోన్మేష భావాలతో పుష్పంలా వికసితమై వున్న ఆమె దేహం ఇప్పుడు ఊడబీకి ఎండలో పారేసిన లేతతోటకూర కాడలాగైంది. తన్నెందుకు దేవుడిలా పుట్టించాలి! 'ఛీ—ఛీ' ఎంత అప్రతిష్ఠ—తన్ను, స్నానంచేసిన శుభ్రశరీరను, అనాచ్ఛాదితమైన వక్షంపై వస్త్రం జారిన' దాన్ని—తుచ్ఛుడు భానుమూర్తి తాకి, లేత గులాబిని కర్కశకర యుగ్మంతో నులిమివేయ ప్రయత్నించినట్లు కామాంధుడై నలిపివేయ ప్రయత్నించి—మైలపరచాడు. కుమిలికుమిలి ఏడుస్తోంది. రక్షణ లభిస్తుందనుకున్న ఇల్లు త్రాచు పాముల కిరవయ్యింది. ఇంకతనకేది దిక్కు? తానాశపెట్టుకుని ఆకాశవీధిలో గాలిమేడలు నిర్మించే—సూర్యం త్రాగుబోతు; జూదరి. సమాజంలో ఒక ఉచ్ఛిష్టంగా మారి పోయింది అతని బ్రతుకు. ఇంతకీ ఇప్పుడు తన్ను పెళ్లి చేసుకోమంటే ఏమంటాడు—తనను ఇంత చేసిన భానుమూర్తి ఆ అన్యాయకుణ్ణి మాత్రం పాడు చెయ్యడని నమ్మకం?—

సావిత్రి భానుమూర్తిని వాతపెట్టింది, అసలు పురుష ప్రకృతే విచిత్రమైంది. ఇట్లాంటి అవస్థల్లో స్త్రీలు ప్రయోగించే ప్రతి ఆఘాతమూ గూడా అట్లాంటి పురుషులవల్ల ఎంతో ఓపిగ్గా సహింపబడతాయి. ఎన్ని తన్నులుతిన్నా అవమానం పొందడు. గోళ్లతో వొళ్ళంతా నెత్తురులు చిమ్మేట్లు రక్కినా సహిస్తాడు. వాతలు లెఖ్ఖపెట్టడు. ఇన్ని బాధలూ తనవల్ల పొందుతున్న ప్రాణిపై సహజంగా అబలమనస్సున సానుభూతి వెలసిందా—సరి. ఆతడు విజయం సాధించాడన్నమాటే. స్త్రీ తాను స్వయంగా చేసిన ఆ ప్రయోగాలే విచ్చుకత్తులై ఆమె అమూల్య సౌశీల్యాన్ని ఖండ ఖండాలు చేస్తాయి—

క్రమంగా కాస్సేపటికి ఆమెలో ఇంకో ఊహ లేచింది "అరే—ఆయ నేమనుకున్నాడో — బ్రతిమాలితే విడిచేవాడు గాదూ—" బాల్య చాపల్యం ఇంకా వదల్లేదు ఆమెలో—పోనీ—ఇతన్ని పెళ్లి చేసుకుంటే—ఏం—ఇతనికేంతక్కువ? రేపు చేసుకోమంటే సూర్యం ఏమంటాడో! రత్తమ్మ బాగా ఉండగానే పెళ్లి జరిగి ఉండవలసింది; కాలేదు. ఆమె ప్రాణం హరీ అంటే తనభావి!—ఇంతలో రత్తమ్మ మూలుగు వినిపించింది—జావపట్టుకు వసారాలోకి వెళ్లింది. దొంగతనం చేసిన దానికిమల్లె రత్తమ్మ మొహం చూడలేక పోయింది సావిత్రి. "ఇలా రాఅమ్మా—ప్రక్కన కూర్చో" అంది దీనంగా రత్తమ్మ. తలవంచుకుని కళ్ళనీళ్లు నింపుకొని అత్తయ్య చెప్పే మాటలన్నీ శ్రద్ధగా వింటోంది. "పిచ్చితల్లీ నీవు పసిదానివి సావిత్రీ—నేనింక నాలుగైదు రోజుల కన్న ఎక్కువకాలం బ్రతకను. కళ్లారా సూర్యమూ నీవూ కాపురం చేస్తుంటే చూద్దామనుకున్నా. ఈ జన్మకు ఆభాగ్యం నాకులేదు. ఒక్క కోరిక చెల్లించు తల్లీ! సూర్యం బొత్తిగా పాడై పోతున్నాడు. చిన్నప్పటినుంచి నేను పెట్టిన గారాం వాణ్ణి ఈస్థితికి లాకొచ్చింది. త్రాగుడుకూడా మొదలు పెట్టాట—నేనుపోయాక నీవూ, వాడూ చెట్టుమీద పక్షుల్లా మిగిలి పోతారు. "అని గ్రుడ్లనీళ్లు గ్రుక్కుకుంది" విచారపడకండి. అత్తా—మీమాట నేను అక్షరాల పాటిస్తాను. చెప్పండిఅంది ఏడుస్తూ సావిత్రి. "ఇంకనుంచి సూర్యం బాధ్యత చిన్నదానివైనా నీమీదే పెడుతున్నా—ఎలాగైనా సరే ప్రయత్నించి మనఊరు తీసికెళ్లిపో వాణ్ణి. మనరైతు వీర్రాజు చాలా మంచివాడు. ఎలాగో త్వరగా మూడుముళ్ళూ పడేటట్లు చూసుకో—సూర్యమూ నీవూ మళ్లీ ఆ యింట్లో దీపం పెట్టి పదికాలాలు బ్రతకాలి" ఆయాస పడుతోంది మాట్లాడలేక రత్తమ్మ. సావిత్రి మౌనంగానే ఆమె చేతిలో చేయినుంచింది. ఇంతలో కెరటంలాగా పెద్ద దగ్గవచ్చింది రత్తమ్మకు. ఆమె లేచి దగ్గలేక పోయింది. శ్లేష్మంతోపాటు బేసినులో నెత్తురుగూడా ముద్దముద్దలుగా పడడం చూసి సావిత్రిగుండె ఝల్లుమంది.

ఆవాళ భానుమూర్తి అసలు ఇంటికే రాలేదు. సావిత్రికి అన్నం సహించలేదు. నట్టనడి సంద్రంలో చుక్కానిలేని నావ పెనుతుపానులో కొట్టుమిట్టాడుతున్నట్టుంది ఆమె బ్రతుకు. రాత్రి ఒంటిగంటకు వచ్చాడు సూర్యం చినిగిన బట్టలతో. తప్పత్రాగి ఉన్నాడు. భోజనానికి లెమ్మంటే ఆమెను కొట్టబోయాడు. మాట్లాడితే "గ్లాసు—గ్లాసు" అంటూ అరవడం మొదలు పెట్టాడు. రాత్రిల్లా బేజారైన గుండెతో సావిత్రికి నిద్ర పట్టనేలేదు.

4

మరి వారం రోజులకు అనుకున్నంత పనీ జరిగి పోయింది. రత్తమ్మ ఇంటిల్లిపాదినీ దుఃఖసముద్రంలో ముంచి స్వర్గస్తురాలైంది. ఆమె కన్నుమూసేసరికి దగ్గర సావిత్రి తక్క ఒరులెవ్వరూ లేరు. కడసారి చూపులుకూడ దీనాతి దీనంగా ప్రార్థించాయి సావిత్రిని సూర్యం భారం వహించమని పదేపదే. ఆవిడ తనువు చాలించిన గంటసేపటికి భానుమూర్తి

వచ్చాడు ఇంటికి. పనిచేసే కుర్రాడిని వెంటనే తీసుకురమ్మని సూర్యం కోసం కబురుపెట్టాడు క్లబ్‌కి. సూర్యం నెత్తీనోరూ మొత్తుకుంటూ వచ్చాడు ఇరుగు పొరుగు వాళ్లు నలుగురూ సాయంచేసి రత్తమ్మ శవాన్ని శ్మశానంకు చేర్చారు. తంతుకయ్యే ఖర్చంతా భానుమూర్తే భరించాడు. మధ్యాహ్నం రెండుగంటలయ్యింది చితికి అగ్గి పెట్టే సరికి అత్తయ్యదేహం అగ్ని కాహుతి అవుతూంటే కడుపు తరుక్కుపోయేటట్లు బావురుమని యేడ్చింది సావిత్రి.

ఆపిల్లకు ఆక్షణంలోనే ఆసంసారం బరువు మీదపడి ఆమెను బొత్తిగా భూమిపై అణచిపెడుతున్నట్లనిపించింది. చితిపైరేగిన జ్వాలలు ఆకసంలోకి నాలుకలుచాస్తూ ఎగబ్రాకుతున్నాయి. ఆమెకు ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి. 'రేపటినుంచీ ఇలాంటి సూర్యంతో బ్రతుకెలాగ? చిన్నచావుగాదు గదా! అరవయ్యోపడి దగ్గరబడి రత్తమ్మ కాలంచేసింది. రేపటినుంచీ జరగవలసిన కర్మమాట! దానాలు ధర్మాలు. చుట్టాలు పక్కాలు. వచ్చేపోయ్యే వాళ్ళ పరామర్శలు—భోజనాలు బొట్లు వాయినాలు. ఆహా! తను వెళ్లినా దినమెళ్ళదంటారు ఇందుకే గాబోలు—పాపం! పిచ్చివాడు! తొమ్మిది నెలలూ మోసి కని పెంచి గారాబుతండ్రినిచేసిన రత్తమ్మచావుకు సూర్యం ఎంత విలపిస్తున్నాడో—ఏమిటో! వెధవబ్రతుకు—ఉన్నన్నాళ్ళూ నాయిల్లూ నావాకిలీ—నాసౌఖ్యమూ ఎంతసేపూ 'నా' గొడవే! బొంది బూడిదౌతుంటే ఏమీ అక్కర్లేదుగదా! ఒక్కరూ కూడా రారుగదా! ఈ జీవితమంతా ఒక మహా మాయావ్యూహం—ఇందులోబడి గుడిగుడి గుంజం తిరుగుతూంటుంది ప్రాణి. దీనికి ఎన్ని మెరుగులు, ఎన్ని ఊహలు. ఎన్ని కాంక్షలు ఎన్ని కోరికలు ఎన్ని...' ఆలోచిస్తూ అలాచూస్తుండగానే మంటలు క్రమంగా చల్లారి పోయాయి. అంతాలేచి ఇళ్లకు చేరుకున్నారు.

కర్మయావత్తూ శాస్త్రోక్తంగా భానుమూర్తే సూర్యంచేత చేయించాడు. 'ఆమెకు ఏమీలోటు చెయ్యలేదన్నారు' చూడవచ్చిన బంధువులంతా. వాళ్ళల్లో అంతా తలోకలాగునా సూర్యం భవితవ్యం చిత్రించుకున్నారు తమలో. కొందరు 'నాయనా-త్వరలో ఆపెళ్లిగొడవకూడా పూర్తిచేసుకుని ఇంటి దగ్గరే కొండ్రమాసుకుంటూ పడిఉండు'మన్నారు. మరి కొందరు సావిత్రిని 'నీవే చూసుకోవాలింక—పాపం! పసిదాని నెత్తిన ఎంత బరువెత్తిపోయిందో రత్తమ్మ' అన్నారు కళ్ళనీళ్ళు నింపుతూ. ఇంకా కొందరు 'ఆసమయానికి పినతల్లిమీద అభిమానం ఉంచుకున్నాడు భానుమూర్తి—ఏమాటకదే చెప్పుకోవాలి. ఈరోజుల్లో ఇంతఖర్చు ఎవడు భరిస్తాడమ్మా! లేదంటే అరసంచి పైచిలుకు అయివుంటుంది. కాకపోయినా ఆభగవంతుడు కూడా అవసానకాలానికి ఎవరినో ఒకర్ని చూపిస్తాడు' అన్నారు.

పన్నెండోనాడు సమారాధన జరిగింది. బంధువులంతా ఎవరిమటుకువారు జారుకున్నారు. మరి రెండురోజుల అనంతరం సూర్యం భానుమూర్తి లెఖ్క చూసుకున్నారు జమాఖర్చు—వెరశి అయిదు వందలడెబ్భై అయిదైంది చిల్లరకాగితాలు పాతికా చేతిలోపెట్టి ఆరువందలకీ నోటువ్రాయించుకున్నాడు సూర్యంచేత భానుమూర్తి. పాతబకాయి నాలుగు వందలకీ సరేసరి నోట్లుండనే ఉన్నాయి! ఏదో—స్థిమితపడ్డాక నెలా రెండునెల్లో బాకీసీదాగా ఎత్తేసేలాగ చూడు' అన్నాడు సూర్యంతో.

సాయంత్రం సూర్యం మళ్ళీ క్లబ్బుకువెళ్ళాడు. ఇంట్లో ఏడుస్తూ సావిత్రి ఒకర్తే కూర్చుంది. భానుమూర్తి నెమ్మదిగా ఆమెను ఓదార్చసాగాడు "ఇంక రోజూ ఏడ్చి ప్రయోజనంలేదు. సూర్యం పరిస్థితి చూస్తున్నావుగా. ఇప్పటికైనా సరే—నేనొక్కటడుగుతున్నా—నీతోఅన్న విషయమై జాగ్రత్తగా ఆలోచించావా? నీయిష్టం వచ్చినట్లు చేసుకో—అభ్యంతరంలేదు—నేను ఆవాళ అలాగ చెయ్యడం నాదే పొరబాటు. కేవలం భ్రమపడి అలాగ చేశాను. నీకుకూడ ఇష్టమేనేమో అనుకున్నాను. దానికి నీవేమీ చింతించకు—ఏమంటావ్" అని ప్రశ్నించాడు. సావిత్రికి మరీ దుఃఖం అధికమయ్యింది. ఆమె ఆలోచిస్తూంది 'భానుమూర్తి భ్రమించడంలో తప్పు చెయ్యలేదేమో. అంతకుపూర్వం చూపులతో భావాలు ప్రకటించడంతప్ప తానూ, ఆతడూ ఎదుటపడి ప్రత్యక్షంగా ఆసందర్భంగూర్చి ప్రస్తావించుకోనిదే'—గుండెధైర్యంగా చిక్కబట్టుకొని రత్తమ్మకు తాను చేసిన వాగ్దానం వ్యక్తపరచింది. భానుమూర్తి ఒక దీర్ఘ నిశ్వాసం విడిచాడు "సరే—ఇంక ఈక్షణం నుండి నేనుగాని నీవుగాని ఆసమస్యను తలపెట్టవద్దు. జరిగిపోయిందేదో జరిగింది. రేపటినుండి పదిహేను రోజులలో మరి నీవేమి ఆలోచిస్తావో సూర్యంతో—మరేం చేసుకున్నా సరే—మీరిద్దరూ ఇక్కడనుంచి మకాంమార్చేటట్టు చూడాలి. నేనుమాత్రం ఎన్నాళ్లు పోషిస్తాను—ఏదో ఇంకో సంబంధమైనా చూసుకోవాలిగా. బాగా ఆలోచించుకోండి ఆనక" అంటూ

లేచాడు భానుమూర్తి. మళ్ళీ యథావిధిగా ప్రారంభమయ్యింది పాడుజీవితం సూర్యానికి. రాత్రి పన్నెండింటికి మైకంలో గడపత్రొక్కాడు. సావిత్రి పడిపోకుండా అతన్ని చెయ్యి బట్టుకొని మంచంపై వాల్చింది. ఏదో అనునయించడానికి ప్రయత్నిస్తే ఆమెపై చెయ్యిచేసుకుని రెండుకొట్టాడు చెంపపై. ఆమెకు ప్రాప్తించిన దురవస్థకు మళ్ళీ బావురుమని ఏడ్చింది. కంటికి కునుకులేదు. ఈమధ్య భానుమూర్తి గూడా ఇంటికిరావడం మానేశాడు రాత్రిళ్ళు.

మరునాడుదయం సూర్యం సావిత్రీ ఘర్షణ పడ్డారు. సంభాషణలు తీవ్రంగా సాగించుకుంటుండగా భానుమూర్తి ప్రవేశించాడు. అతడు వచ్చిన తర్వాత గూడా తీక్ష్ణంగా మాట్లాడు కుంటున్నారు—

"ఏమైనా సరే రేపు మకాం మార్చెయ్యాలి. భానుమూర్తిగారు చెప్ప నే చెప్పారు" అంది సావిత్రి. "అలాగేలే—ఇంకా నెలరోజులుండి పనేదేనా చూసుకుని" సూర్యం.—"ఇంకా ఈ ఉళ్ళో ఉండడమా. వద్దు—ఎంతమాత్రం వద్దు."

"ఔను—నీకుమాత్రం లోటేమిటీ—ఏం తక్కువౌతోంది ఈఇంట్లో"

"అదేవిటి అలా మాట్లాకుతున్నారు—చెరుకు తియ్యగాఉందని వేళ్ళతో పెల్లగించుకు తింటారా"

"నీఇల్లులాగ చూసుకుంటున్నావుగా! ఏం ఇబ్బంది వచ్చిపడింది"

"నాయిల్లా" సావిత్రి గజగజ వణకిపోయింది. ఆమెకు సూర్యం ఇలాగనడంలో అర్థంకనపడలేదు. సూర్యం తన్ను అనుమానిస్తున్నాడు దేనికో—"ఏం—ఏమీ ఎరగనట్లు మాట్లాడుతున్నావు" అని చెయ్యి చేసుకోవడానికి లేచాడు సూర్యం. భానుమూర్తి కలుగ చేసుకున్నాడు. "తగ్గుసూర్యం తగ్గు—పెళ్ళి కాని పిల్లపై అలా చెయ్యి ఎత్తడానికి నీకు అధికారం ఎవడిచ్చాడు" అన్నాడు. సూర్యం వైఖరి క్షణంలో మారిపోయింది. మతిపోయినవాడైనట్లయ్యాడు. "ఔను—భానూ—క్షమించు. మాఅమ్మ బ్రతికున్నట్లే చనువుగా అనుకొని మూర్ఖత్వం ప్రకటించాను. నేనింకా పిచ్చిలోనే ఉన్నాను. కాకపోతే ఈమెకూ నాకు సంబంధం ఏమిటీ?— నే నెవరిని ఈమెను శాసించడానికి.—చివరకు నాబ్రతుకు ఇలా బ్రద్దలు చేసుకున్నాను. ఒకరిని అని ప్రయోజనం శూన్యం దీపం ఉండగా ఇల్లు చక్కబెట్టుకోకపోతే ఏమవుతుంది. యౌవనం మైకంలో పడుచువనపు బింకంతో ఏమేమో అనుకొని ఏదేదో చేసేశాను. సావిత్రి పెళ్ళికాని పిల్ల—కన్య. ఆమెను తాకడానికైనా నాకు అధికారంలేదు-అధికారం ఎన్నేళ్ళు పెంచితేమాత్రం ఎంత శుశ్రూష చేస్తేనేం—ఎంత ప్రేమచూపితేమాత్రం ఒరులసొత్తు మనదౌతుందా—ఎరువు ఏడాదుంచుకుంటే మాత్రం స్వంతం ఎట్లాగౌతుంది" అనుకుంటూ పిచ్చిధోరణిలో పడి వలవల ఏడ్వడం ప్రారంభించాడు.

సావిత్రికి మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్లయింది. ఉన్నవాటికిదో బెడగొంప. కానిఒకటి: ఇతః పూర్వం వచ్చిన ఆపదలన్నింటిని సైపడానికి నిర్మితమయ్యే దుర్భేద్యమైన మహాదుర్గంవంటి మనస్సులో తనకు తెలియకుండా పునాదులు ఊగిసలాడుతున్నట్లు కనుపిస్తోంది. ఇలాంటప్పుడు ఏది దారి? సూర్యం ఇలా మారిపోవడానికి కారణం? అసలు ప్రపంచం తంతే ఇంతా? లేక మహాకష్టాలు లేనిదే పెనుతుపాను లేని సాగరంవలె జీవితంలో చేవ వుండదా? తనను ఈబాధలో ముంచి సూర్యం లేచి వెళ్ళిపోయాడు—అతనితో మాట్లాడడానికేనా అవకాశం లేకుండా అస్త్రం చేతలేని యోధుణ్ణి శరపరంపరలచేత వొళ్ళంతా తూట్లుపొడిచి పోయినట్లు తన్ను దిగ్భ్రాంతను చేసి, వెన్నులో పొడిచేసి, తనయెదను పొడిచేసి, మనస్సును హూనంచేసి వెళ్ళిపోయాడు—ఇదంతా చూస్తూ భానుమూర్తి రాయిలా పడి వుండిపోయాడు.

తల్లి దండ్రులులేని తాను—ఊహరాని పసితనం నుండి చీమూ నెత్తురూ ధారవోసి ఎవరికైతే సేవచేసిందో, మానాభిమానాలను మంటగలుపుకొని ఎవరికైతే దాసిగా బ్రతికిందో, గాలిమేడలు కట్టుకొని దృఢచిత్తంతో నాటివరకు జీవిస్తోందో—భవిష్యత్తులో గూడా ఎవరి యండన తానొకపత్నియై ఇల్లాలై, స్త్రీయై సభ్యమానవ ప్రపంచంలో జీవించ నువ్విళ్ళూరుతోందో—ఆ సూర్యం తన్ను కాలదన్నాడు. ఆలేబ్రాయపుకన్నె చిన్న బ్రతుకులో ఎంతటి ఎనలేని ఒడిదుడుకులు కల్పించావు హతవిధీ!

'ఛీ! ఈ ప్రపంచాన్ని ప్రేమించగూడదు. ఏకాకిని, అర్భకుని, తోటివాడనీ—జూదరి, త్రాగుబోతు, భ్రష్టుడు, అవినీతిపరుడు—అట్టివాణ్ణి—కేవలం చిన్నప్పటినుంచి తనకతడే భర్తయని పెద్దలయెదుట రూపొందించుకున్న కారణాన, ఒకానొక ప్రాణికి అవసానదశలో మాటయిచ్చిన కారణంగా—తనకుఎదుట 'వేసివేయ్' మని లక్షాధికారివంటి, వయసులోఉన్న, అన్నింటికన్నా తనపై

మోజుతో మగులుగొని తహతహలాడే—యువకుణ్ణి కాలదన్ని—కేవలం పవిత్ర హిందూధర్మానికి కట్టుబడి, తన్నే దేవునిగా పూజిస్తూన్న సావిత్రిని ఉత్తమురాలిని అనుమానించాడు సూర్యం! అయినా తన గడపదాటలేదు సావిత్రి—ఓహో! పసితనంలో ఇంతటి దిట్టతనం ఈపిల్ల కెలాగలిగిందో. ఈఅసిధారా వ్రతచర్య వీళ్ళకి ఉగ్గుబాలకు ముందే వచ్చిఉందేమో లేక భారతదేశ సహజప్రకృతిలోనే ఈసహజ శక్తికి ఏనాడో మహర్షుల మంత్రోచ్చాటనవల్ల మహాసాధ్వీమణుల దివ్యత్వంవల్ల బీజారోపణ గలిగిందేమో.

5

భానుమూర్తి చూచాయగా రెండుమూడు దఫాలు సూర్యంతో సహా ఇల్లు ఖాళీచెయ్యమని వ్యక్తంచేశాడు సావిత్రికి. ఆమెకు గూడా ఇంక మళ్ళీమళ్ళీ అతగానిచే స్పష్టంగా అనిపించుకోగూడదని పౌరుషం గలిగింది. అయితే ఏం చేస్తుందీ? చేతిలో ఎర్రని ఏగాని లేదాయె. సూర్యంకు చీమకుట్టినట్లైనా తోచదు. ఆమెకో ఉపాయం తట్టింది. సాహసించి వీర్రాజుకు ఉత్తరం వ్రాసింది. ఎంతకొద్ది మొత్తమైనాసరే పైకంమాత్రం తెమ్మని హెచ్చరించింది. సావిత్రివద్దనుండి లేఖ రావడం వీర్రాజుకు కొంచెం విపరీతంగానే తోచింది. రత్తమ్మ పెత్తనం వచ్చినప్పటినుండి సొమ్ము ఇస్తున్నాడు; పుచ్చుకుంటున్నాడు. ఎప్పుడూ శిస్తు నాగా పెట్టలేదు. ఆవిడ పోయింతర్వాత గూడా సూర్యం వ్రాసినప్పుడల్లా డబ్బు పంపుతూనే ఉండె—మరి యీయమ్మ ఉత్తరం వ్రాసిందేమా అనిపించి సందేహనివృత్తిచేసుకోవడానికి మర్నాడే బయలుదేరి పట్నం చేరుకున్నాడు వీర్రాజు.

రైలు దిగి వస్తూంటే వీర్రాజుకు క్లబ్బుకు వెళ్ళే సూర్యం దారిలో ఎదురుపడ్డాడు. "ఏమోయ్! వీర్రాజూ, ఇలా దిగేవేమిటికథ— సొమ్ముగానీ ఏమైనా జతపడిందా" అన్నాడు సూర్యం. "లేదు బాబూ! వారమేనా కాలేదు నూటయాభై పంపుకున్నాను. మళ్లీ సావిత్రమ్మ ఇలా గుత్తరం వ్రాసిందేంటీ" అన్నాడు ఆత్రుతను ప్రకటిస్తూ వీర్రాజు.

సూర్యం విస్తుపోయాడు. "ఏమిటీ? సావిత్రి ఉత్తరం వ్రాసిందా? అపుడే అంతవరకూ వచ్చిందన్నమాట! ఏమని వ్రాసిందీ" సూర్యం తీక్ష్ణంగా ప్రశ్నించాడు. "ఏం వ్రాస్తుంది బాబూ! సొమ్ముకు ఇరకాటంగా ఉంది. ఎంతైనా సరే తెమ్మని" వీర్రాజు జవాబిచ్చాడు. "పోనీ! ఆవిడ వ్రాసినందుకేనా తెచ్చావుగాదే—లేకపోతే తెచ్చే నా దగ్గర దాపరికం వుంచుతున్నావా" తాపీగా మళ్ళీ అడిగాడు సూర్యం. "నీ తోడు లేదు బాబూ. కాపోయినా ఏడనేనా చెట్టుగానా వుందేటి బాబూ రూపాయలు దులుపుకురావడానికి. పిల్లా పీమాతో గంపెడు సంసారం—మీ రెరుగని దేముందీ?" అన్న వీర్రాజును ఇంటిదారి చూపి సాగనంపి తాను క్లబ్బుకు సాగిపోయాడు సూర్యం.

వీర్రాజు గుమ్మంలో అడుగెడుతూండగానే కుంచెడు నీళ్ళకు గుమ్మరించింది సావిత్రి వీర్రాజు చిన్నప్పటినుండి ఆమెను బాగా ఎరుగు. తన చేతుల మీదుగా ఎత్తుకుమోసిన పిల్ల ఇలా గేడుస్తూంటే చూడలేకపోయాడు. రత్తమ్మ పోయినందుకే సావిత్రి అలా కుమిలిపోతోం దనుకుంటున్నాడు గాని అసలు సంగతి అతనికేం దెలుసును? "ఊరుకో తల్లీ ఊరుకో-పోయిన వాళ్లతో పోగలమా? ఏదో—ఎవరికి నూకలు చెల్లిపోతే వారు వెళ్ళిపోతారు" అంటూంటే, "ఇంక రోజు వెళ్ళే దారిలేదు వీర్రాజు తాతా" అంటూ బావురుమంది సావిత్రి. "ఏవమ్మా—నీకేం—నిక్షేపంగా నేడో రేపో సూర్యంబాబుకూ నీకూ కల్యాణం అవుతుంది. ఆయనా చదువుకున్నాడు. ఎక్కడ తల తాకట్టుపెట్టినా నెలకు వంద తెస్తాడు" అంటూంటే "ఆ దారె అధ్వాన్నమైపోతోంది తాతా" అని దుఃఖిస్తూనే సూర్యం జీవితం గూర్చి క్లుప్తంగా చెప్పింది. వింటూ వీర్రాజు విస్తుపోయాడు. "అయితే అమ్మ దినవారంఖర్చుకని నే పంపిన అయిదు వందలూ ఆరిపేశాడన్నమాట. మొన్న మళ్ళీ నూటయాభై...ఇలా తగలేస్తూంటే గనులేనా ఆగవు" అని నొచ్చుకున్నాడు. సావిత్రి కీమాటలు వింటూంటే గుండెదడ పట్టుకొంది.

వీర్రాజు కాపుగూడా ఏమీ తేలేదు. సాయంత్రానికల్లా సూర్యం ఇంటికొచ్చేశాడు. బహుశా మధ్యాహ్నం జేబులోవున్న పాతికరూపాయలూ ఆరిపోయుంటాయి — లేకుంటే రాత్రి పన్నెండింటిదాకా రానివాడు ఈవాళ ఇంత పెందరాళే వచ్చేస్తాడా అనుకొంది. పట్నంలో ఎవరో స్నేహితుణ్ణి చూచివచ్చి రాత్రి కక్కడే పడుకొని చీకటితోనే లేచి పల్లెకు పోతానని చెప్పి వీర్రాజు ఎక్కడికో వెళ్ళాడు.

సుమారు ఏడవుతుంది. వచ్చిన అర్ధగంటసేపటిలోనూ సావిత్రిగాని సూర్యంగాని ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. ఒకళ్లనొకళ్లు చూసుకోలేదు

గూడా. దీపం పెట్టడానికని సావిత్రి లోనికి వెళ్ళింది. సూర్యంగూడా ఆమెను వెంబడించాడు గదిలోకి. సంజచీకటిలో అగ్గిపెట్టెకోసం గూడు తడుముతూన్న సావిత్రితో ప్రసంగం ప్రారంభించాడు. ధుమధుమలాడుతూ "ఊఁ—అయితే వీర్రాజు ఎందుకొచ్చినట్లూ! కాకపోయినా వ్యవహారం ముదురుతున్నట్లుందే". "నేనే రమ్మని వ్రాశాను. మరి మీకు వేడెక్కడంలేదు. ఎన్నాళ్ళీకొంపమీదపడి తింటాం? ఏమేనా సొమ్ము జతపడితే తెమ్మని వ్రాశాను."

"ఔను—కష్టమే-ఖర్మంచాలక నేను గూడా తగులడ్డానాయె మధ్య."

"అదిగో—అదే మళ్ళీ మాట్లాడొద్దంట."

"అహ్హా—హ్హా! (నవ్వి) పోనీలే—ఆ గొడవెందుకు రోజూ ఉండేదేగా—వీర్రాజు ఏమాత్రం తెచ్చాడు?"

"వొట్టిచేతుల్తో వచ్చాడు."

"ఇదిగో—అబద్ధం ఆడకు. నాకు ఇప్పుడు సొమ్ము అత్యవసరం—వెంటనే ఇవ్వు."

"మీకు అవసరంకాని దెప్పుడూ?అస్తమానమూ మనం డబ్బు తగలెయ్యడమేగా."

"అదిగో—ఆ ఊసే ఎత్తొద్దన్నాను. నువ్వేమైనా నీసొమ్ము పెడుతున్నావా. వీర్రాజిచ్చినా నాదేగదా—పోతే భానుమూర్తి ఇస్తే ఓలాగ నీకు హక్కున్నట్లు ఇంకోలాగ నాకూ హక్కుంది ఆ సొమ్మమీద."

"మీతో మళ్ళీ చెబుతున్నా—ఆ పాపిష్ఠి కూతలే కూయొద్దని."

"నీతో ఘర్షణ అనవసరం నాకు. వెంటనే పది రూపాయ లిలా పారెయ్.

"లేవు—నాదగ్గర లేనిదే."

"నేను నమ్మను. ఎంతగా స్వతంత్రించకపోతే నీవు వాడికి ఉత్తరం వ్రాయగలవూ? ఊఁ తొందరగా తే—లేకపోతే చెయిచేసుకుని నే తీసుకోవలసి ఉంటుంది" కళ్ళెర్రబడ్డాయి సూర్యానికి. వళ్లు వణకింది సావిత్రికి—"చెయ్యిచేసుకుంటారా—నన్ను చంపెయ్యండి—నా దగ్గర ఎఱ్ఱని ఏగాని లేదు" సూర్యం అమాంతంగా సావిత్రిని రెక్క పట్టుకున్నాడు—ఆమె విదలించుకోవడానికి ప్రయత్నించింది రెండవచేత్తో. పెనగులాడ్డంలో ఆమె చేతులకున్న గాజులు పప్పూ పప్పూ అయిపోయాయి. పైట జారిపోయింది. కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్వడం ప్రారంభించింది. సూర్యం ఇంకా గదిస్తూనే ఉన్నాడు. సాయంత్రం జూదపాటలో సర్వం ఒడుచుకుని పిడిచేసి వికటాట్టహాసాలతో క్లబ్బునుండి బయటకు గెంటివేయడంవల్ల క్రమ్ముకున్న మైకం పొరలు ఇంకా విచ్చిపోలేదు. సావిత్రి ఏడుస్తూనే ఆతనినుండి తప్పించుకోన ప్రయత్నించింది.

ఇంతలో బయటనుండి వచ్చి ఎవరో సావిత్రిని సందిట పొదివిపట్టుకొని సూర్యం నుండి విడదీశారు. ముందు వీర్రాజు కాపేమో అనుకొంది. కాని కాదు. దారినబోయే వాళ్లెవరేనా ఏమో అని భ్రమించింది. "సూర్యం నీవు రోజురోజుకీ పశువైపోతున్నావు. పెళ్లికాని పిల్లపై చెయ్యిచేసుకోవడానికి నీకు పెత్తన మెవ డిచ్చాడు! ఛీ—తుచ్ఛుడా-ఫో—అవతలికి" గర్జన వెలువడ్డ కంఠం సావిత్రికి భానుమూర్తిని పరిచయం చేసింది. త్రుటిలో ఆమె ఎంతగానో కుంచించుకుపోయింది. క్షణంక్రితం ఆమె పొందిన తృప్తి దుఃఖంగా నయనాలనుండి పైకుబికింది. సూర్యంచేత నిందించబడుతూ హింసించబడుతూండడమే ఆమెకు భానుమూర్తిచేత ఆ అవస్థలో అలా విడదీయబడం కంటె వేయిరెట్లు ఆనందాన్ని నుమడింపచేసింది. భానుమూర్తి తన్ను పొదివిపట్టుకోవడం ఇది రెండో సారి. విధి కరాళ కాళికవలె వేయి నాలుకలు చాచి తన కుసుమకోమల జీవితాన్ని నలిపివేయ బ్రయత్నిస్తున్నట్లు తోచింది. ఏ అవస్థలోనూ తన్ను భానుమూర్తి తాకగూడదు! ఇది ఆమె వజ్రకఠోర నిశ్చయం. కాని విధి ప్రతికూలించింది. తన నిశ్చయం భగ్నమైంది. తన్ను కాపాడ్డానికే కావచ్చు ఆ నీచుడు తాకాడు. అందునా సూర్యంసమక్షంలో—తన్ను భానుమూర్తి రెండు చేతులతోనూ బంధించి విడదీశాడు—సూర్యాన్ని తూలనాడుతున్నాడు. తనపై సూర్యానికి హక్కు లేదని ఖచ్చితం చేస్తున్నాడు. అయితే ఈతూరి ఆతని స్పర్శలో విషం లేదు—వాంఛ లేదు. కామం లేదు. కాని ఈ ఘట్టం సూర్యంలో ఎంతటి విప్లవమో తీసుకొచ్చింది. అదిగో—ఆతడు పెళపెళ మాట్లాడేస్తున్నాడు అవమానాగ్నితో దహింపబడి.

"ఔను. తల్లిలేనివాడికి, తండ్రే దమ్మిడీ లేనివాడికి, జూదరికి, త్రాగుబోతుకి—ఇట్లాంటి శ్రీమంతుడి ప్రాపకంలో ఉన్న కన్యను ముట్టడానికి హక్కెక్కడిదుంది?—క్షమించండి—సావిత్రీ—భానుమూర్తీ—సర్వమూ కోలుపోయి పిచ్చివాణ్ణై మరో

న్మత్తతచే నీపై చేయిచేసుకున్నా — సావిత్రీ నీ వెవరవు? నేనెవర్ని? క్షమించు—బుద్ధి వచ్చింది." అంటూ రొప్పుకుంటూ రోజుకుంటూ గుమ్మం దాటుతున్నాడు. ఈలోగా భానుమూర్తి దీపం వెలిగించాడు.

సావిత్రి ఒక్కమారుగా దీపాన్ని చూచి మళ్ళీ కళ్ళు మూసుకుంది. ఏ పాపమూ ఎరుగకపోయినా మహా నేరం చేసిన ముద్దాయివలె కళ్ళుమూసుకొని వెక్కి వెక్కి ఏడుస్తూ వీధివెంట బడింది. ఇదంతా అప్పుడే ఊళ్ళోంచి వస్తున్న వీర్రాజు చూశాడు. "నీకేమైనా మతిపోయిందా రావమ్మా ఆయ నేవస్తాడు" అని బలవంతంగా సావిత్రిని ఇంటికి లాక్కొచ్చాడు వీర్రాజు.

సావిత్రికి రాక తప్పిందిగాదు. కాని రాత్రల్లా విపరీతమైన ఆలోచనలు ఆమెను కలచివేశాయి. తుపాను నాటి నడురేయి కడలి తరగల్లా ఎన్నో ఊహలు ఆమెలో మౌనంగా మహా సంఘర్షణ సాగించుకున్నాయి. "వెళ్ళిపోయాడు సూర్యం. తన ఆశాజ్యోతి ఆరిపోతోంది — మళ్ళీ రాడు. అతనికి యధార్థం ఎలా తెలుస్తుందీ? భానుమూర్తి చెప్పినా నమ్మతాడా సూర్యం! ఆవాళ అంతకుమించి అబల, పైసాయైనా లేని తాను ఇంకెలా మాట్లాడాలి? మాట్లాడిందే అనుకో—తన్ను చంపేసినా బావుండేది సూర్యం-—విధి—శనియై కలియై తన్ను బ్రతికించి కలకాలమూ కాల్చడానికా? కాకపోతే ఆ సమయంలో భానుమూర్తి నెందుకు తీసుకురావాలీ అక్కడికి?— వస్త్రమాత్రం అతగాడు అలా విడదీయనా? తీసీ— ఎంతో నిర్లక్ష్యంగా—సర్వమూ సూర్యంసొత్తేఅయి— స్వాతంత్ర్యం అనేది కన్యాత్వం అనేది ఏనాడో ఎగఊపిరి దిగఊపిరిగా కొట్టుమిట్టాడే రత్తమ్మ చేతిలోవుంచి ఆమెతోనే సాగనంపబడిందే— మరింకలాంటప్పుడు హక్కు లేకపోవడమేమిటే— పిచ్చిభానుమూర్తీ—సావిత్రి సర్వస్వమూ సూర్యమే అయిపూర్చుందోయి అతనిది కానిదొక్కకణమేనా ఆమెలో లేదు—తనపాపం అలా బ్రద్దలైంది. తెల్లవారుతుంది—ప్రొద్దు ముఖంమాసే దెట్లా—రేపటి నుంచి రోజు గడవడం?"

6

సావిత్రి బ్రతుకంతా చూసి వీర్రాజుకు ఎంతో జాలివేసింది. మరునాడు ప్రొద్దుట తనతో గ్రామానికి రమ్మన్నాడు. సూర్యం లేనిదే రానంది సావిత్రి. సూర్యంగూడా వచ్చే ఉపాయం ఆలోచిద్దామన్నాడు కాపు. వీర్రాజుకు ఇట్లాంటివాళ్ళను వశపరచుకోవడం డబ్బువల్ల కొంచెం సాధ్యమవుతుందని తెలుసు. 'అబ్బే! అది అసాధ్యం' అంటుంది సావిత్రి. 'ఐనా ప్రయత్నిద్దాం' అంటాడు వీర్రాజు. భానుమూర్తి ఇంటినేగాదు కేవలం పట్నవాసాన్నే వదిలి పల్లెటూళ్ళో మకాం పెడితేనేగాని వాళ్ళ బ్రతుకు బాగుపడదని అతనివాదన. పెద్దవాడు ఎందుకు చెప్పాడో ప్రయత్నిద్దా మనుకొని బయలుదేరింది సావిత్రీ స్వస్థలానికి.

మధ్యాహ్నం రెండుగంటలకు ఊరు చేరుకున్నారు సావిత్రీ వీర్రాజూను. ఆమెకు సూర్యం లేకుండా అవూళ్ళో అడుగుబెట్టడమూ, రత్తమ్మ పోయినతర్వాత తొలిసారిగా రావడమూ ఏదో మహా నేరస్థురాలిగా ఇల్లు ప్రవేశించినట్లు చేశాయి. కన్నీటిధారలలో ఇంట్లో ప్రతిగదినీ త్రొక్కింది. లంకంతఇంట్లో తాను ఉండగలనా అని హడలిపోయింది. వెనకటిరోజుల్లో ఎంతో పెద్ద కుటుంబాలు మసలినమండువాలోగిలి. ఇప్పుడు దీపం పెట్టే నాథుడు లేక పాడైపోతోంది. అంగుళన్నర ఎత్తున పట్టింది మట్టి నేలమీద. నెత్తిపైకెత్తితే తారాడే బూజులు. గబ్బిలాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇంట్లో ఉన్న ధాన్యాగుల నెప్పటినుంచి బొక్కుతున్నాయో ఎలుకలూ, పందికొక్కులూను. రత్తమ్మత్తిఉంటే పెద్దపులిలా ఇల్లంతనూ పాలించేది. సావిత్రి కిప్పుడు ఏమూల కెళ్ళినా ప్రాణగొడ్డంగా ఉంది. గోడలు బీటలుదీసి బెల్లులు ఊడిపోతున్నాయి. నాటుపెంకు ఎన్నాళ్ళయిందో వేసి అడుగు వెదురు బద్దలు చివికి పెణకవంగి విరుచుకుపడుతుందా అనే భయం కలుగుతోంది. ఈ యింటిలోనా తాను భవిష్యత్తులో సూర్యంతో జీవించాలని కలలు కన్నది? మరి కలలన్నీ కల్లలై పోతున్నాయే? శిథిలమై జీర్ణమై పోయే సామ్రాజ్యరాజధానిలాగున్న ఆ గృహంలో మళ్ళీ వెలుగవలసిన దీపం సావిత్రి. బూజుపట్టి కాలగర్భంలో మఱుగుపడుతున్న, నివురు గప్పుకున్న అగ్ని పాతివ్రత్యం—దాన్ని మళ్ళీ తాను రగిలించాలి తన జీవితాన్నే చమురుగాపోసి ఆ అగ్నిని ప్రజ్వలించాలి. దీనికై తన యత్నం ఫలిస్తుందా? తాను గృహిణియై మళ్ళీ ఆ యింటినీ తన పాతివ్రత్యాన్నీ నిలబెట్టగలుగుతుందా ?

నాటిరాత్రి పాడు పీడకలలెన్నో ఆమె మనసును కలచివేశాయి. ఆమె మనసులో ఎనలేని అశాంతి పాడుకొంది. భావిజీవితాన్ని గూర్చిన ఆలోచనలు

అర్థంలేని ఎన్నో సంఘర్షణల్ని ఆమెలో రగుల్కొల్పాయి. మధ్యాహ్నంనుండి రాత్రిదాకా గ్రామస్థులు జరిపిన పరామర్శలు, వారి ఓదార్పులు ఆమె దుఃఖాన్ని అధికంచేశాయి. పట్నవాసం గాదుగదా? పల్లెటూరాయె! దేనికి దానికే సుఖానికి సుఖానికే — దుఃఖానికి దుఃఖానికే ఒండొరులపట్ల తమకుగల ఆప్యాయతల పురస్కరించుకొని హావభావాల్ని ప్రకటించుకోకుండా ఉండజాలని ప్రవృత్తి వాళ్ళది.

మరునాడు వీర్రాజు ఎక్కడో తలతాకట్టు పెట్టి ముప్ఫై రూపాయలు తెచ్చి ఆమె కిచ్చాడు దానితో అసలు సంసార మనిపించమని చెబుతూ. ఒక్క హంగూ లేదాయె యింట్లో. మరి రత్నమ్మ ఉన్నన్నాళ్ళూ యీ వెలితి ఎక్కడ చచ్చిందో! డబ్బు యిచ్చి జాగ్రత్తగా ఖర్చుపెట్టమని మరీ మరీ చెప్పి వెళ్ళాడు వీర్రాజు. సావిత్రికి తన చేతిలో ముప్ఫయి రూపాయలు చూడగానే ఏంతో ఆశ జనించింది. ఆ క్షణంలో ఎన్నో ఊహలు ఆమెలో మెదిలాయి. ఏమేమో నిశ్చయించుకొంది. ఆ రూపేణా దేవుడు తనకు నడియేటబడి కొట్టుకొనే నావవంటి బ్రదుక్కి చుక్కాని చూపినట్లైంది. పెందరాళే వంట చేసేసుకుని ఇల్లు ఉన్నంతలో జాగ్రత్తగా సర్ది తాళం వేసి ఏకాఏకిని పట్నం బయలుదేరి సాయంత్రం నాలుగింటికి చేరుకుంది కారుపై.

పట్నంలో అడుగు పెడుతూనే సూర్యంకై వెదుకడం మొదలుపెట్టింది. తిన్నగా క్లబ్బుకెళ్లింది. ఎవరూ తనకు సూర్యం భోగట్టా చెప్పలేకపోయారు. బంట్రోతుమాత్రం చూచాయగా తెలియబరచాడు "ఒట్టిచేతులతో రెండుసార్లు వచ్చి అంతా నవ్వితే విసుక్కొని బిక్కమొగమేసి ఎటకో వెళ్ళాడ"ని. బహుశా డబ్బుకోసం ఎవరినో తడుముతూంటాడని అన్నాడు. అక్కడనుండి భానుమూర్తి యింటికి వెళ్ళింది. భానుమూర్తి లోపలనుండి కుర్రాడితో కబురుచేశాడు ప్రొద్దుట సూర్యం తనదగ్గరకు వచ్చాడనీ డబ్బు ఇమ్మని బ్రతిమాలాడనీ అయితే తాను ఏమీ ఇవ్వలేదనీ ఎక్కడ ఉంటాడో తెలియలేదనీ, త్రాగుబోతుకు ఒక మకాం అంటూ ఉండదనీ చెప్పాడు. ఆమె సాహసించి లోపలికెళ్ళి దీనంగా అడిగితే, భానుమూర్తి ఇపుడు పూర్తిగా తమతో తెగతెంపులు చేసుకున్నాడు. తాము ఎదరబడితే ఒకపీడ లాగుందిఅతనికి. దీనికి రెండేరెండు కారణాలు. ఒకటి ఆమె అతన్ని—అతడు ఎంత బ్రతిమాలినా ఎంత ఆశపెట్టినా వినక కాదనడం; రెండవది సూర్యం మర్యాద విడిచి ప్రవర్తిస్తూ అతని డబ్బు మంచినీళ్ళలాగున వాడెయ్యడం, త్రాగుబోతై అతనికిగూడా చెడ్డపేరు తెప్పించడం. సావిత్రికి ఏంచెయ్యాలో తోచలేదు. రాత్రి అవుతోంది—సూర్యాన్ని గుర్తుపట్టడం ఎలాగ?

మనస్సును పరిపరివిధాల పరువు లెత్తించే ఆలోచనలతో ఊరంతా గాలిస్తోంది. పార్కులు, సినీమా హాళ్ళ ప్రాంగణాలు, రైలుస్టేషను, క్లబ్బులు, నదీతీరం—తిరుగుతోంది పిచ్చిగా వీటివద్ద. రాత్రి ఎనిమిదవుతుంది. ఒక దృశ్యాన్ని చూచి ఆమె చకితఅయ్యింది. కిళ్ళీ కొట్టుదగ్గర ఒకచోట ఘర్షణ జరుగుతోంది. ఎవరో తీవ్రంగా మాట్లాడుకుంటున్నారు. దూరాన్నుంచి ఆమె జాగ్రత్తగా ఆ గొడవను పరికిస్తూ ఏమిటో చూద్దామని అటు బయలుదేరింది. దాదాపు కిళ్ళీ దుకాణం సమీపించేసరికి చిలికి చిలికి గాలివానైపోయింది. చేతులు చేతులు కలుసుకున్నాయి. ఖాలీసోడాబుడ్లతో, కర్ర చెక్కలతో ఒకళ్లనొకళ్లు బాదుకొంటున్నారు. అందులో ఒకరిద్దరు తప్పత్రాగి ఉన్నారు.

ఆమె సరిగా షాపువద్దకు వచ్చేసరికి జరుగవలసినదంతా జరిగిపోయింది. నలుగురూ ఆ త్రాగుబోతుల్ని చావమోది గాయపరచారు. వారిద్దరూ స్పృహతప్పి పడిపోతే ప్రక్కనున్న చెట్టువారకీడ్చేశారు. అందులో ఒకరికి కణత పగిలి నెత్తురు చారికలు కట్టింది. గుడ్డలు మరకలయ్యాయి నెత్తుటితో. సావిత్రి అందరినీ పోనిచ్చి ఆ వ్యక్తిని పరీక్షగా చూసింది—"సూర్యం" అని కెవ్వున కేక బెట్టి అతని మీద పడింది. కిళ్ళీకొట్టువాడు చూసి "ఎవరమ్మా నువ్వు? ఆయన మీకేం కావాలె"అన్నాడు. "ఈయన మా బంధువు." అంటూ వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది. కిళ్ళీ కొట్టు యజమానికి జాలి వేసింది. "అయినింటివాళ్లు గదా! ఇట్లా వొళ్ళు చూసుకోకుండా మసిలితే ఎట్లాగ? పెందలకడనే ఆసుపత్రికి జేర్చండి. ప్రాణాపాయం రావచ్చు" అన్నాడు. సావిత్రి హడలిపోయింది. రిక్షాను పిలిచి దగ్గరనే ఉన్న రంగారావు డాక్టరుగారి ప్రయివేటు ఆస్పత్రికి చేరవేసింది సూర్యాన్ని.

డాక్టరు అతన్ని జాగ్రత్తగా పరీక్షించాడు. ప్రాణాపాయమైన దెబ్బే తగిలిందన్నాడు, "వెధవ త్రాగుబోతులు—"అని చీదరించుకుని కట్టుగట్టాడు. ఆ రాత్రి. మరునాటి ప్రొద్దుట సూర్యానికి విపరీతంగా జ్వరం వచ్చింది. ఉష్ణంవల్ల మూసిన కన్ను తెరువడంలేదు. రంగారావు క్రొత్తగా ప్రాక్టీసు

పెట్టిన యువకుడు. సావిత్రి స్థితి అతనికి ఎంతో జాలి గలిగించింది. సూర్యం వంటి దౌర్భాగ్యులపై ఎంతమాత్రమూ దయదలచ గూడదన్నాడు.

ఆ జర్వం అట్లానే నిలబాటు చేసిందిగాని తగ్గలేదు. సూర్యం శరీరస్వాస్థ్యం నానాటికి బాగా తప్పిపోసాగింది. రంగారావుగారి ఆస్పత్రిలో ఉంచి మందు ఇప్పిస్తూనే ఉంది సావిత్రి. తాను తెచ్చుకున్న పైకమూ అయిపోయింది. సూర్యానికి తెరుపూ మరుపూ అవుపించడంలేదు. డాక్టరుగారు రోగం నయమవడానికి చాలా రోజులు పడుతుందనీ ప్రస్తుతానికి కనీసం రెండు వందలేనా ఉంటేగాని మనిషి మనలోకి రాడనీ నిర్ధారణచేశాడు. డబ్బు తెస్తేగాని మందిచ్చే స్థితిలో లేడు ఆయన. జాలిగా బ్రతిమిలాడుకొంది సావిత్రి. కాని ససేమిగా వీల్లేదన్నాడు రంగారావుగారు. సూర్యానికి క్రమేపీ శ్రుతి మించిపోతోంది. రెండు వందలు ఆమె కెలా వస్తాయి. రోజులు గడుస్తున్నకొద్దీ రాత్రింబవళ్ళు ఆమె కిదొక సమస్యగా పరిణమించింది.

ఊహాసంఘర్షణ తెగిపోయింది. తుట్టతుదకు ఒక నాటి సాయంత్రానికి ఆమె ఒకనిశ్చయానికివచ్చింది. ఎలాగైనాసరే సూర్యాన్ని బ్రదికించుకోవడం ఆమె కర్తవ్యం. రాత్రి ఏడు గంటలౌతుంది. వొళ్ళంతా ముసుగు వేసుకున్నట్లు దుప్పటి గప్పుకుని తిన్నగా భానుమూర్తి ఇంటికి బయలుదేరింది. అతన్ని ఎలాగ ప్రాధేయపడైనా సరే డబ్బు తీసుకురావాలని ఆమె వజ్రనిశ్చయం.

హాల్లో ఒంటరిగా కూర్చుని ఏదో సుదీర్ఘంగా ఆలోచిస్తున్న భానుమూర్తి పాదాలు సావిత్రితో స్పృశింపబడేసరికి అతడు ఈ ప్రపంచంలోకి వచ్చాడు. క్షణంసేపు తన కళ్లు తానే నమ్మలేకపోయాడు—ఏమిటీ! సావిత్రేనా తన్ను తాకుతా! దిగ్భ్రమతో త్రుళ్ళిపడ్డాడు—"ఆఁ—ఎలాగుందేమిటీ? సూర్యానికి. నాలుగు రోజులనుండి చూడ్డానికి వద్దామనుకుంటే తీరికే లేదు" అంటూంటే అతని పాదాలపై తడి అతని శరీరాన్ని పులకింపజేసింది. "ఏడుస్తున్నావా! సావిత్రీ! నీవే ఇంత బేలవైపోతే ఎట్లా? లే—అలా దుఃఖించకు" ఆమెను తన రెండు చేతులతోనూ లేవనెత్తి ఎదుటమంచంమీద కూర్చుండబెట్టాడు. ఈ మాటలు ఆ పడుచుకు ఎంతో ఎత్తిపొడుపుగా తోచి వేధించుకు తినసాగాయి. అయితే ఈసారి భాను తన్ను లేవనెత్తడంలో, అతని ఈ స్పర్శలో కేవలం ఒక నూతనత్వం ఆమె గుర్తించింది, భానుమూర్తి మారిపోయాడు. ప్రపంచం నిజస్థితి తెలుసుకుని జాగ్రత్తపడుతున్నట్లున్నాడు.

"ఏంచెప్పను–నేను ఏకాకినై విధితో పోరాడుతున్నాను. ప్రపంచంలోఎవ్వరూ సాయంచెయ్యడంలేదు. సూర్యం చావుబ్రతుకుల్లో ఉన్నాడు. నేను తమను ఒక సాయం చేయమని ప్రార్థిస్తున్నాను ఈక్లిష్టసమయంలో" కన్నీటిధారలతో చెప్పుకుపోయే ఆమెను ఆపాడు, భానుమూర్తి "అలాగా! అంత శ్రుతి మించిందన్నమాట! అవును! త్రాగుడూ, జూదం ఎంత వాణ్ణైనా ఇంతలో పీనుగును చేసేస్తాయి. ఇళ్లు వళ్లు గుల్ల చేసే పిశాచాలు. అయితే ఇంతకీ—(తటపటాయించి) నేనేం చెయ్యగలను" జాలిగొలిపేటట్లు ప్రయత్నిస్తూ అన్న ఈ పలుకులలో అతడు దేనికో సన్నద్ధుడగుతున్నట్లు పసికట్టింది సావిత్రి. కానీ దాన్ని ఎదుర్కోవాలి దీనంగా ప్రారంభించింది "చెయ్యగలరు. మీ రొక్కరే నాకిపుడు తోడ్పడగలరు తలుచుకుంటే"

"అలాగా (నవ్వు తెచ్చుకోవడానికి ప్రయత్నించి) అయినా ఆ సాయమేమిటో సెలవిస్తే ఈ దీనుడు"

"భానుమూర్తిగారూ! అలాటి మాటల కిది సమయంగాదు. మీ ఎదుట వొక వ్యక్తి ప్రస్తుతం వర్ణనాతీతమైనవిపత్తులోబడి గిలగిల తన్నుకుంటోంది. దాన్ని ఉద్ధరించడం కనీసం మానవధర్మం.

"ధర్మాలుగూడా తెలిసిన మీతో ఎలా మాట్లాడాలో"

"బహువచనప్రయోగంతోనూ, ఎగతాళిగానూ నన్ను నొప్పించవద్దని ప్రార్థన"

"ప్రార్థనా—ఓహో! ఎన్నాళ్లకి దిగివచ్చారు. ఈ అపరసావిత్రిగారు! (హేళనగా) సావిత్రీ—నీవు ఎవరిప్రార్థనలేనా వింటేగదా ఒరులు నీ ప్రార్థన వింటారు—నీవు పెట్టినవాత ఈనాటికీ వెయ్యికీలలై నా మనస్సును శరీరాన్ని దహించి వేస్తోంది"

"అందుకని ఇప్పుడు ప్రతీకారం తీసుకో దలచారా? ఇది మీకు న్యాయమేనా?"

"ప్రతీకారమా — నేనేమీ తీసుకోదలచుకోలేదు. సావిత్రీ! విను. నేను ఆనాడు తుచ్ఛుడనై నీచుడనై నీయెడల అలాగ ప్రవర్తించలేదు. సూర్యంతో నా అవస్థచెప్పి అతని అంగీకారంపొంది, అతడు నీపై అంత మక్కువతో లేడని తెలుసుకొన్నాకనే—నీవు వెనకటి నీ సంచారంలో నన్ను

ఏవగించుకోకపోయినందునే — ఒక మర్యాద గల పురుషుడుగా నిన్ను వివాహం చేసుకోదలచాను. కాని నీవో—నిర్దాక్షిణ్యంగా చేతికొచ్చిన ఫలాన్ని కాలదన్నావు. బుద్ధొచ్చింది నాకు."

"అయితే అదికూడా మీ కల్పనే అన్నమాట"

"కల్పనగాదు. ఆశఉన్న ప్రతివాడూ అన్ని దారులూ వెదుక్కుంటాడు — ఎదిరి తనను ప్రతిఘటించేవరకు ఆశిస్తూనే ఉంటాడు. ఇది ప్రపంచ ధర్మం"

"ఇపుడు నామీద దయ దలచరూ నన్ను? నాకొక రెండువందల రూపాయ లిప్పించండి. చర్మంతో చెప్పులు కుట్టియైనా మీ రుణం తీర్చుకుంటాను"

ఆమె రుద్ధకంఠంతో మాట్లాడింది—

"ఏమిటీ! రెండువందలా దాదాపు వెయ్యిదాకా వాళ్ళ వెన్నునపోశాను. ఇంక చూస్తూ చూస్తూ డబ్బు తగలెయ్యడానికి నేనేమీ అవివేకినిగాను— కాకున్నా ఎదుటివాళ్ల ఎదల్లో ఆ వేదన గుర్తించలేని మీవంటి విశ్వాసహీనులకు నేను ఏ సాయమూ చెయ్యను. తగుదునమ్మా అని అడొగొచ్చావుగాని— ఇంక నీవు వెళ్ళవచ్చు" కోపంగా చించుకున్నాడు గొంతు భానుమూర్తి.

సావిత్రి పౌరుషంతో చివాలున లేచింది. కొద్దిక్షణాలు యోచించింది తీవ్రంగా. గుమ్మందాకా రెండడుగులు వేసింది. ఈ కొంచెం సమయంలోనూ ఎంతో సంఘర్షణ చెలరేగింది. ఆశలన్నీ ఉడిగిపోతున్నాయి. ఇంక ఒక్కటే ఆయుధం మిగిలింది. అదే వజ్రాయుధంగా తన్నింతవరకూ కాపాడుతూ వచ్చింది. దాన్నికూడా ప్రయోగించవలసి వచ్చింది —తుదకు తన ప్రాణం కన్నా కూడా మిన్నయనుకున్నదాన్నే విడిచెయ్య దలచుకుంది. ఇదంతా తన భర్తకోసం—తన నిధానం కోసం అనుకొంది. పాతివ్రత్యంకోసం ఆ పతివ్రత తన పాతివ్రత్యాన్నే బలిపెట్ట నిశ్చయించుకొంది. సావిత్రి గుండె పాషాణమైపోయింది.

కుర్చీలో కూర్చున్న భానుమూర్తి పాదాల చెంత కుప్పలా కూలబడింది. నెమ్మదిగా లేవ ప్రయత్నించి అతని రెండు చేతులూ తన కుసుమకోమల కరయుగ్మంతో స్పృశించింది. ఆ స్పర్శలో ఎంతో వ్యామోహాన్ని విద్యుత్తులాగ ప్రవహింపచేయడానికి ప్రయతిస్తూ లేని మందహాసం ప్రకటిస్తూ "జరిగిందేదో మరచిపో భానూ—ఇప్పుడు సావిత్రి నీ అధీన— నీవేం చెయ్యమన్నా సరే సిద్ధం—కాని నా క్కావలసింది డబ్బు. శంకించకు—డబ్బిచ్చేసి ఈమెను నీ వశం చేసుకో—"—ఓహో! ఎంతటి పతనావస్త— హిమాలయ పర్వతం హిందూ మహాసముద్రంలోకి దొర్లిపడుతూంటే ఇంతటి సంఘర్షణ అవుపిస్తుందా — మరి ఈ దేశంలో పతివ్రత మనడం ఎలాగ—ఓ! అలాగే! నిక్షేపంగా బ్రతుకుతుంది. ఆమె మనడమేమిటి? జాతినే నవనవోన్మేషంతో జీవింపచేస్తుంది. ఇది తథ్యం. భారతీయ ఆదర్శమే ఇది. ఇదే లేకుంటే ధర్మమే లేదు...యుగయుగాల మన చరిత్రలో మనలను రక్షించిం దీమహాశక్తియే—ఇదే ఈనాడూ మనకూ మన స్త్రీలకూ పరమాదర్శం— దీన్ని విస్మరించిన వారికి గత్యంతరం లేదు— చూడండి—సావిత్రిని అగ్నిపరీక్షకు గురిచేసిన ఆవిధి— నిర్దయతో కఠోరంగా ఆమెను దహించిన దైవం. ఆమెను లేవనెత్తడం తనవిధిగా ఆమె సేవకై వస్తాడు—దీనుల్ని రక్షించడం ఆయన కర్తవ్యం గాదూ -హేళనతో అనండి-లేదా కోపమే అనండి- నీచత్వమే కానీండి, పోనీ దానవత్వం అందాం—

ఏదైనాసరే అది భానుమూర్తి ముఖతః వచ్చింది. అతడు ఒకే ఒక వికటాట్టహాసం చేశాడు "సావిత్రీ! నీవు మహాపతివ్రతవు—నేను ధూర్తుడుగా నీచుడుగా రుజువు పరచావు—నాకా అవమానం చాలు. వెళ్ళు ఇక్కడనుంచి నీ కల్లబొల్లి కబుర్లు కట్టిపెట్టి-ఉందిగా నీ పాతివ్రత్యం నిన్నే కాపాడుతుంది. ఎవరిపై ఆశబెట్టుకున్నావో వారే నిన్ను రక్షిస్తారు." ఒకే ఒక త్రోపు త్రోసివేశాడు ఆమెను ఇలా గర్జిస్తూ. ఆ దూకుడుకి సావిత్రి అమాంతం గడపమీద పడిపోయింది. కణత పగిలేటంత దెబ్బతగిలి నెత్తురు నుదుటిమీదనుండి చారికలు గట్టింది. "పో అవతలకి—ఏ గాలికా ఊగు ఊగే కులటల కిక్కడ తావులేదని" తలుపు మూసేశాడు.

సావిత్రికి తగిలిన దెబ్బకన్నా భానుమూర్తి మాటలు ఆమెను ఏ నిద్రలోనుంచో హఠాత్తుగా మేలుకొలిపాయి. అతని పలుకుల్లోనే భగవానుడు తనకిచ్చిన దివ్యసందేశం ఇమిడిఉన్నదని గుర్తించింది. తన చపలత్వానికి తగినశిక్ష ఆ దెబ్బ అనే స్వీకరించింది. ఆమెలో మబ్బుతెరలు విడిపోయాయి. ఆశలన్నీ ఉడిగిపోయాయి. కేవలం దైవంమీదనే భారం వుంచి ముందుకు సాగింది. నెత్తురుమయమైన నుదుటితో ఆసుపత్రికి చేరింది. ఎలుగెత్తి పిలిచింది డాక్టరును.

హాలులోకి వచ్చి లైటు వేశాడు రంగారావు. ఎదుటి దృశ్యం చూసి తెల్లబోయాడు. తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. త్రుటిలో మందు తీసుకొచ్చి ఆమెకు కట్టుకట్టాడు. ఆమెను తాకడం డాక్టరుకు అదే ప్రథమం. ఆ స్పర్శలో—ఆమె దీనత్వం- ఆమె నిస్సహాయత - కుసుమకోమలత - ఆమె పరిస్థితి సావిత్రి సౌజన్యం—రంగారావు హృదయంలో ఎక్కడో ఇరుక్కుని ఇవతలికి రావడానికి ప్రయత్నించే కరుణను వెలుగులోకి లాక్కొచ్చాయి. స్వయానా తన సోదరి ఇంతటి దీనస్థితిలో ఉన్నా భావించలేనంతటి ఉత్తుంగ శిఖరాలకు అతన్ని లేవనెత్తింది ఆ కరుణ. ముంగురులు సవరించి గాయం కడిగి ఒపిగ్గా కట్టుకట్టాడు.

క్షణంలో సావిత్రి కన్నీళ్లు అతన్ని తడిపివేశాయి—ఎండలో ఎడారి దాటివచ్చిన బాటసారి చలివేంద్రంలో కాలూనగానే పొందే సౌఖ్యం అది—నట్ట నడిసంద్రంలో చుక్కాని పోగొట్టుకొని అలల సుడుల ఒడులమధ్య క్రిందుమీదై తీరం జేరవేసుకొన్న నావలో నావికుడు పొందే ఆనందం అది—దేనితోనూ పోల్చలేని ఒక విచిత్రవిస్మయావస్థ ఆమెది. క్రమంగా సేదదీర్చుకుని రంగారావుగారివద్ద తన చరిత్రనంతా కన్నీటి ధారలతో వెళ్లబోసుకుంది. ఆ పశ్చాత్తప్త హృదయగాథ డాక్టరుకుగూడా పశ్చాత్తాపం గలిగించింది. "లే సోదరీ! లే—నీవు చెల్లివే గాదు తల్లివమ్మ—నాకేగాదు లోకానికి-సావిత్రీ- నీవు సాక్షాత్తుసావిత్రి వేనమ్మ — ఇంతదనుక జరిగిన అవినయానికి మన్నించవూ" అని ఆమె చేతులు పట్టుకున్నాడు. ఆమె మొదట్లోనే అసలు సంగతి చెప్పనందుకు చింతించాడు.

తన యావచ్ఛక్తినీ ధారపోసి నెల నాళ్లకు సూర్యానికి జీవం రప్పించాడు. అక్కడనే వివాహం జరిగించడానికి సిద్ధపడ్డాడు సావిత్రికీ సూర్యానికీ—అయితే వారుమాత్రం అంగీకరించలేదు. ఆయనకు అభ్యంతరం లేకపోతే తమపల్లెకువచ్చి తమ్మ ఆశీర్వదించమన్నారు. మరి నెల్లాళ్ళకు పెళ్ళి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ వివాహం హడావుడిఅంతా వీర్రాజు కాపుదే. పెళ్ళి శుభలేఖలు వ్రాసే ప్రసక్తి వచ్చేసరికి భానుమూర్తిని పిలవనన్నాడు సూర్యం.— "ఏం—" అంది సావిత్రి—కొంచెం ఘర్షణ జరిగింది ఇద్దరికీ—

"అసలు దీనికంతకు కారకుడుగాదు సావిత్రీ! ఆ ధూర్తుడు?" సూర్యం అన్నాడు.

"ఔను—నిజంగా దీనికంతకూ అతడే కారకుడు అందుకే పిలవాలి ఆయన్ను"

"నీమీద లేనిపోని అనుమానాన్ని నాలో రేకెత్తించి నాకు నీయెడల విముఖత్వం రెక్కొలిపాడు. నేను నిజంగా నమ్మి నిరాశను పూరించుకొని హృదయబాధను మరలించుకొందామని ఆపాడు త్రాగుడు అలవరచుకున్నాను. ఏం చెయ్యనూ! అంతకుతక్క నాకు ఇంకోదారి దొరకనిదే"

"ఐనాసరే—మనల్ని ఎన్నో విధాల అతడు ఆదుకున్నాడు. మనను కష్టాలు పెట్టినవాళ్లే ఒక్కొక్కప్పుడు మహాపదల్లో తమకు తెలీకుండా మనకు ఆశాకిరణాలు ప్రసారిస్తారు. ఇదే సృష్టిలో ఒక వైపరీత్యం—నేను అనుభవంవల్ల దీన్ని గుర్తించా. కాబట్టి ఆయన్ను ఆనందంతో ఆహ్వానించి గౌరవించండి"

"నీది ఎంతో లోతుగుండె. నీ ధారణశక్తి అపారం సావిత్రీ! అందుకే ఇంతటి సాగరం ఈదగలిగావు"

"దీనికి మీ ప్రేమయే చుక్కాని"

సూర్యానికీ సావిత్రికీ మహావైభవంగా స్వగ్రామంలో వివాహం జరిగింది. ఊరు అశేషజనమూ ఆనందాబ్ధిలో ఓలలాడారు. డాక్టరుగారు వచ్చి నాలుగురోజులూ ఉండి వారిఆతిథ్యం అంగీకరించారు. బంధువులంతా వచ్చారు. భానుమూర్తి రావడం సూర్యానికి పెళ్లి సమయంలో నూటపదహార్లు చదివించడం ఒక ప్రత్యేకతగా మెరిసింది సావిత్రి హృదిలో—సూర్యం మదిలో—ఎందుకో!